నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
ఆదివారం డిసెంబర్ 15, 2024 www.navatelangana.com

నేడు, రేపు గ్రూప్-2 పరీక్షలు

- ఏర్పాట్లు పూర్తి : కలెక్టర్‌లు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/కామారెడ్డి

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నేడు, రేపు (ఆది, సోమ) జరుగనున్న గ్రూప్-2 పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. 15న ఉదయం 10.00 గంటల నుండి మధ్యాన్నం 12.30 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 3.00 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు సెకండ్ సెషన్ పరీక్షలు జరుగుతాయని, ఆ మరుసటి రోజైన 16వ తేదీన కూడా అవే సమయాలలో రెండు సెషన్ లలో పరీక్షలు జరుగుతాయని వివరించారు. జిల్లాలో మొత్తం 19854 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. అభ్యర్థుల సంఖ్యకు అనుగుణంగా మొత్తం 63 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని అన్నారు.

కామారెడ్డి పట్టణంలో 19 సెంటర్లలో 8085 మంది అభ్యర్థులు పరీక్ష రాయబోతున్నారని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తెలిపారు.

బాలసదన్‌లో దుప్పట్లు పంపిణీ

నవతెలంగాణ-కంఠేశ్వర్



విద్యార్థులకు దుప్పట్లు అందజేత

లయన్స్ క్లబ్ ఆఫ్ విజేత (320డి) ఆధ్వర్యంలో నగరంలోని బాలసదన్ లోని విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ విజేత 320డి అధ్యక్షులు, టీజీవో అధ్యక్షులు అలుక కిషన్ విద్యార్థులకు దుప్పట్లు అందించారు. చలికాలంలో విద్యార్థులు చలి నుంచి రక్షణ పొందేందుకు దుప్పట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రోగ్రాం చైర్మన్ గా చిట్టి నారాయణ రెడ్డి వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి టీజీవో ప్రధాన కార్యదర్శి అమృత్ కుమార్, లయన్స్ క్లబ్ ఆఫ్ విజేత సభ్యులు ఉమాకిరణ్, సంజీవ్, సతీష్, జహనాబ్, కపిల్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

టీచర్‌ల డుమ్మాలకు చెక్

- ప్రతి ప్రభుత్వ స్కూల్‌లో ఉపాధ్యాయుడి ఫోటో, వివరాలు
- నకిలీ టీచర్ల నివారణకు సర్కార్ చర్యలు
- కొత్త జీవో విడుదల చేస్తున్న ప్రభుత్వం



ఫైల్

నవతెలంగాణ-నిజాంసాగర్

ప్రభుత్వ విద్యాశాఖను బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తుంది. ఉన్నతాధికారులను మచ్చిక చేసుకొని.. తమ బదులుగా ఇతరులను ఏర్పాటు చేసుకొని పాఠాలు బోధింపజేస్తున్న పలువురి ఉపాధ్యాయుల ఆటలు కట్టించేందుకు ప్రభుత్వం కీలక చర్యలకు ఉపక్రమించింది. ప్రభుత్వ స్కూళ్లల్లో ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తించే వారిలో పలువురు.. తమ స్థానంలో వేరే వ్యక్తులను ఏర్పాటు చేసుకొని పాఠాలు బోధిస్తున్నట్లు సమాచారం. దీంతో బడులకు వెళ్లకుండా విధులకు ఎగనామం పెట్టే ఉపాధ్యాయులపై చర్యలకు ఉపక్రమించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. వారి స్థానంలో మరొకరిని నియమించి పాఠాలు చెప్పిస్తుండటంపై వాటి నివారణతో పాటు చర్యలు చేపట్టేందుకు విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. పాఠశాలలో టీచర్ల ఫోటోతో పాటు వివరాలు ప్రదర్శించాలని ఆదేశాలు జారీ చేసింది. విధులకు డుమ్మలు కొట్టే టీచర్లు, తమకు బదులుగా ఇంకొకరిని నియమించి పని కానిచ్చే మాస్టర్ల ఆటలు సాగనివ్వకుండా ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టింది. విద్య వ్యవస్థను బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తున్న ప్రభుత్వం ఇకనుంచి పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఫోటోలు, వారి వివరాలు ప్రదర్శించేలా తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఏ పాఠశాలలో ఏ ఉపాధ్యాయుడు, ఎందరు పనిచేస్తున్నారనే వివరాలు ఆయా గ్రామాల వారికి తెలిసిపోతుంది. దీంతో సదరు ఉపాధ్యాయులు విధులకు గైర్హాజరైన పక్షంలో ఆ సమాచారం గ్రామస్తులు తెలుసుకొని అవకాశం కలుగుతుంది. ఆయా పాఠశాలలకు తనిఖీకి వెళ్లిన అధికారులు, నాయకులకు సైతం సదరు పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయుల వివరాలు తెలిసిపోతాయి.

ఉమ్మడి నిజాంసాగర్ మండలాల మొత్తం 46 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ఇందులో ఇంచుమించుగా 153 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల నూతనంగా జాయిన్ అయినా ఉపాధ్యాయులు సుమారు 37 మంది ఉన్నారు. రాష్ట్రంలోని అన్ని సర్కార్ బడుల్లో పనిచేస్తూన్న ఉపాధ్యాయుల ఫోటోలు, వారి వివరాలు తమ విధులు నిర్వహిస్తున్న పాఠశాలలో ప్రదర్శించాలంటూ ప్రభుత్వం ఇటీవలే ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో అక్కడక్కడ ఉపాధ్యాయులు కొందరు తమకు బదులుగా ఇతరులను నియమించి వారికి రూ.3000 నుంచి 5000 వరకు చెల్లిస్తూ తమ విధులను కొనసాగిస్తూ వారు వేరే వ్యాపారాలు కొనసాగిస్తున్నారని ఆరోపణలు ఉండేవి. తాము విధులు నిర్వర్తించకుండా నిర్వర్తించినట్టు పూర్తి వేతనం తీసుకుంటూ తమ స్థానంలో ఇతరులతో పనికానించేసేవారు. ఇలాంటి సంఘటనల దృష్ట్యా ప్రజలు టీచర్ల బెడద అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. కొందరు డుమ్మా టీచర్ల కారణంగా సక్రమంగా విధులు నిర్వర్తించే ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని చాలా గ్రామాల్లో పాఠశాలలకు ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదని, సక్రమంగా రావడం లేదని ఆరోపణలు ఉన్నాయి. దీంతోపాటు కొన్ని ఉపాధ్యాయ సంఘాలు పాఠశాల వేళలో బయట తిరగడం చేస్తున్నారు. ఉపాధ్యాయుడు పూర్తి వివరాల ప్రదర్శనతో ఇటువంటి సమస్యల పరిష్కారానికి టీచర్ స్థానంలో ఇతరులు వచ్చిన పక్షంలో విద్యార్థులకు, తర్వాత గ్రామస్తులకు వెనువెంటనే తెలిసిపోతుంది. ఫలితంగా డుంమ్మ టీచర్లు ఆటకట్టించవచ్చనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది.



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

పీహెచ్‌సీల బలోపేతానికి కృషి

- బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరు సుదర్శన్‌రెడ్డి

నవతెలంగాణ-ఎడపల్లి

రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేసేందుకు గాను, ఎన్నికల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వైద్యం పేద ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా తమ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండలానికి నూతనంగా వచ్చిన 108 అంబులెన్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం పేదల ఆరోగ్యాలను కాపాడలేకపోయిందని, ప్రభుత్వ వైద్య సేవలను గాలికి వదిలేసిందన్నారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ప్రభుత్వాసుపత్రిలో వైద్యులు అందుబాటులో ఉండాలని, గ్రామాలలో పనిచేసే ఏఎన్ఎంలు సకాలంలో విధులకు హాజరుకావాలని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. అందుకే వైద్యరంగంలో ఉన్న ఉద్యోగులు క్రమశిక్షణతో పని చేయాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హమ్దాన్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాజశ్రీ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పులి శ్రీనివాస్, నిజామాబాద్ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బిల్లా రామ్మోహన్, మాజీ జెడ్పీ చైర్ పర్సన్ రజిత యాదవ్, బోధన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, బొబ్బిలి శ్రీనివాస్ కరటూరి సత్యనారాయణ, సహకార సంఘం అధ్యక్షులు పోల మల్కా రెడ్డి, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

దొంగ నోట్ల తయారీ చేస్తున్న

అంతర్రాష్ట్ర ముఠా ఆటకట్టు

- 8 మంది నిందితుల గుర్తింపు.. ఆరుగురు అరెస్ట్
- బిచ్కుంద, బాన్సువాడలో ఇప్పటికే చలామణిలోకి 3 లక్షల నకిలీ కరెన్సీ
- నోట్లపై సెక్యూరిటీ ఫీచర్‌ను గమనించాలి : ఎస్పీ సింధుశర్మ



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సింధుశర్మ



పోలీసులు స్వాధీనం చేసుకున్న నకిలీ కరెన్సీ, ప్రింటర్, కంప్యూటర్

నవతెలంగాణ-కామారెడ్డి

అంతరాష్ట్ర దొంగ నోట్ల తయారీ, చలామణి చేస్తున్న ముఠా గుట్టును కామారెడ్డి పోలీసులు రట్టు చేశారు. దొంగ నోట్ల తయారీ చలామణి చేస్తున్న 6 గురు సభ్యులను అరెస్ట్ చేసి విచారించగా.. మొత్తం 8 మంది ఉన్నట్లుగా గుర్తించినట్టు ఎస్పీ సింధుశర్మ తెలిపారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. 13వ తేదీనా బాన్సువాడ పట్టణ పోలీసులు కొయ్యగుట్ట వద్ద వాహనముల తనికి చేస్తున్న సమయంలో ఒక కారు లోని వ్యక్తులు పోలీసు వారిని చూసి వారి కారును కొద్ది దూరములో నిలిపి తిప్పి పారిపోవుటకు ప్రయత్నించగా వెంటనే పోలీసులు జాగ్రత్తపడి ఆ కారును వెంబడించి పట్టుకున్నారు. కారులోని ముగ్గురు వ్యక్తులు కడపత్రి రాజగోపాల్, కొలవర్ కిరణ్ కుమార్, రమేష్ గౌడ్ పట్టుకొని కారును తనిఖీ చేయగా వారి వద్ద 30 లక్షల రూపాయల నకిలీ కరెన్సీ పట్టుబడింది. ఈ విషయంపై వారిని విచారించగ తెలంగాణ, కర్ణాటక, రాజస్తాన్, ఉత్తరాఖండ్, మహారాష్ట్ర రాష్ట్రాలకు చెందిన 8 మంది సబ్యులు ఒక ముఠా గా ఏర్పడినట్లు తెలిపారు. ఇందులో తెలంగాణకు చెందిన రాజగోపాల్, కర్ణాటక కు చెందిన హుస్సైన్ పీరా లు ఇద్దరు నకిలీ నోట్ల తయారీ, చలామణి యందు పెట్టుబడి పెట్టారని, రాజస్తాన్ రాష్ట్రాలకు చెందిన కమలేశ్, సుబ్రామ్, ఉత్తరాఖండ్ రాష్ట్రానికి చెందిన రాధాకృష్ణ (భరద్వాజ్) లు వీరు ముగ్గురు కలిసి నకిలీ కరెన్సీ తయారు చేస్తారని తెలిపారు. కామారెడ్డి జిల్లాకు చెందిన గతంలో ప్లాస్టిక్ వ్యాపారం చేసే కిరణ్ కుమార్, రమేష్ గౌడ్, మహారాష్ట్ర కు చెందిన అజయ్‌ఈశ్వర్ ఇట్టి నకిలీ కరెన్సీ ని చలామణి చేస్తున్నట్లుగా తెలిపారు. వీరు హైదరాబాద్ లోని గౌలిగూడ, సిటిసి లలో నకిలీ నోట్ల తయారీకి అవసరమగు సామగ్రిని కొనుగోలు చేసి బోయినిపల్లి లోని అంటిలియ అపార్ట్మెంట్ లోని పెంట్ హౌస్‌ను నెలకు ఒక లక్ష అద్దె చెల్లిస్తూ కిరాయికి తీసుకొని అందులో ఇట్టి తయారీ పరికరాలను అమర్చి ఇప్పటికే 60 లక్షల విలువ చేసే 500 నోట్ల నకిలీ కరెన్సీని ప్రింట్ చేసినట్టు తెలిపారు. వాటిలో 3 లక్షల నకిలీ కరెన్సీ ని బిచ్కుంద కు చెందిన కిరణ్ కుమార్, బాన్సువాడకు చెందిన రమేష్ గౌడ్ లకు చలామణి నిమిత్తం ఇచ్చారు. వారు వారి చుట్టుపక్కల గ్రామాలల్లో వాటిని చలామణి చేసేశారు. ఈ విదంగా వారి పథకం విజయవంతం కావడంతో, మరికొంత నకిలీ కరెన్సీని తీసుకువచ్చి ఆదేవిదముగా చలామణి చేయాలని అనుకోని 30 లక్షల నకిలీ కరెన్సీ ని హైదరాబాద్ నుండి (గతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే) రాజగోపాల్ తీసుకొని వచ్చి కామారెడ్డి జిల్లాలోని బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన కిరణ్ కుమార్, రమేష్ గౌడ్ లకు ఇచ్చి ముగ్గురు కలిసి కారులో రాజగోపాల్ ను బాన్సువాడ బస్ స్టాండ్ వద్ద దింపుటకు వెళ్తుండగా పట్టుబడినట్టు తెలిపారు.

తమ విచారిస్తున్న సమయంలో ఈ నోట్ల తయారీ చేసి చలామనికి సిద్ధంగా ఉంచిన మిగిత నకిలీ కరెన్సీ హైదరాబాద్ లో ఉందని, హుస్సైన్ పీరా, బారద్వాజ్, అజయ్ లు హైదరాబాద్ లో ఉన్నారని నిందితులు తెలుపగా.. హైదరాబాద్ కు వెళ్ళి వారు తయారు చేస్తున్న అపార్ట్మెంట్ కు వెళ్ళి తనిఖీ చేయగా అక్కడ రూ. 26 లక్షల 90 వేల విలువ గల 500 నోట్ల నకిలీ కరెన్సీ, నకిలీ నోట్ల తయారీకి ఉపయోగించిన సామగ్రి అంతటినీ స్వాదీనం చేసుకొని అక్కడ ఉన్న హుస్సైన్ పీరా, భరద్వాజ్, అజయ్ లను అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. ఈ ముఠాలో 8 మంది ఉండగా కమలేష్, సుబ్రామ్ ప్రస్తుతం పరార్ లో ఉన్నారని వారిని త్వరలోనే పట్టుకోనున్నట్టు తెలిపారు. 500 రూపాయల నోట్లను తీసుకునే ముందు వాటి సెక్యూరిటీ ఫీచర్‌లను పరిక్షించాలని ప్రజలకు సూచించారు.

ప్రజా సమస్యలపై పోరాటం చేయాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పెద్ది వెంకట్ రాములు



మాట్లాడుతున్న పల్లపు వెంకటేశ్

నవతెలంగాణ-మాక్లూర్(ఆలూర్)

ప్రజా సమస్యలను గుర్తించి ప్రభుత్వం ద్వారా వాటి సమస్యల పరిష్కారానికి సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పోరాటం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పెద్ది వెంకట్ రాములు పిలుపునిచ్చారు. ఆలూరు మండలంలోని రామచంద్రపల్లి గ్రామ శివారులో గల వడ్డెర కాలనిలో పార్టీ ఆర్మూర్ ఏరియా రాజకీయ శిక్షణ తరగతులు శనివారం నిర్వహించారు. ముందుగా రామచంద్ర పల్లి వడ్డెర కాలనీ కమ్యూనిటీ భవనం నందు రామచంద్ర పల్లి శాఖ కార్యదర్శి ఈడగోటి సాయిలు జండా ఆవిష్కరణ చేసి ప్రారంభించారు. ప్రారంభానికి ముందుగా అమరవీరులకు సంతాప సభ నిర్వహించి ఒక నిమిషం మౌనం పాటించారు. ఈ సందర్భంగా సభ్యులకు గతి తార్కిక భౌతిక వాదం పని పద్ధతులు క్లాసును పెద్ది వెంకట రాములు బోధించారు. ఈ క్లాస్‌కు కొండగంగాధర్ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. ప్రధానంగా పాలకవర్గాలు వాస్తవా లను కప్పిపుచ్చి మతోన్మాదాన్ని ప్రజల్లోకి ఏ విధంగా తీసుకెళ్తున్నారో వివరించారు. నిజ జీవితంలో మానవుడు ప్రకృతిపై పోరాడుతూ సమాజాన్ని మారుస్తూ వచ్చాడని ఈ మార్పు వల్ల అభివృద్ధి చెందినట్టు తెలిపారు. కానీ పేద ప్రజలను మూఢ విశ్వాసాల వైపు మళ్ళిస్తున్నారని, సైన్సును అందరు ఆచరించాలని వాస్తవాన్ని తెలుసుకోవాలని తెలిపారు.

పార్టీ నిర్మాణం క్లాసును ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్ వివరించారు. ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి సిరుపలింగం పాటలు పాడుతూ పార్టీ సభ్యులను ఆనందింపజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఆర్మూర్ డివిజన్ కమిటీ సభ్యులు కోతాడు ఎల్లయ్య, టీ భూమన్న, అశోక్, ఓంకార్, రఫీ, గణేష్, పద్మ, బండారి ఎల్లయ్య, లక్ష్మి, పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులకు ఎన్నో సౌకర్యాలు

- రాష్ట్ర అటవీ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రమేష్

నవతెలంగాణ-ఎడపల్లి



డైట్, కాస్మోటిక్ చార్జీల చాట్ ఆవిష్కరణ

ప్రభుత్వం గురుకుల పాఠశాలలో చదివే విద్యార్థులకు ఎన్నో సౌకర్యాలను కల్పిస్తుందని రాష్ట్ర అటవీ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రమేష్ అన్నారు. శనివారం బాలికల గురుకుల పాఠశాలలో జరిగిన డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపుపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ధరలకు అనుగుణంగా పెంచి ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో మాట్లాడుతూ.. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగించుకోవాలని సూచించారు. బోధనలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరూ అయిందని త్వరలో వీటి పనులు ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి సాయిలు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ గంగా శంకర్, తల్లిదండ్రులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. బాలికలు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి.

చట్టాలపై పరిజ్ఞానం ప్రజలకు మరింత చేరువ చేయాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల
- కోర్టులలో జాతీయ లోక్ అదాలత్
- నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 14,537 కేసుల పరిష్కారం



నిజామాబాద్‌లో మాట్లాడుతున్న జిల్లా జడ్జీ కుంచాల సునీత



బోధన్‌లో...

నవతెలంగాణ-కంఠేశ్వర్/బోధన్/ఆర్మూర్

చట్టాల పరిజ్ఞానం ప్రజలకు మరింత చేరువ చేయాల్సిన అవసరం ఉన్నదని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవ అధికార సంస్థ చైర్ పర్సన్ సునీత కుంచాల అన్నారు. గ్రామస్థాయిలో న్యాయసవలు విస్తరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నదని తెలిపారు. కోర్టులలో ప్రభుత్వంపై దాఖలైన సివిల్ భూనష్ట పరిహార దావాలలో ఒక సామరస్యపూర్వక పరిష్కారం దిశగా అడుగులు పడవలసి అవసరం ఉన్నదని ఆమె పేర్కొన్నారు. ఈ శనివారం జరిగిన జాతీయ లోక్ ఆదాలత్ లో ఒక మోటారు వాహన ప్రమాద నష్టపరిహార దావాలో గో డిజిట్ జనరల్ ఇన్సూరెన్స్ కంపనీ లిమిటెడ్ వారితో, బాధితులతో సంప్రదింపులు జరిపి రాజీపద్ధతిన పరిష్కరించి ఒక కోటి 25 లక్షలకు గాను లోక్ అదాలత్ అవార్డు జారీ చేయడం చాలా గొప్ప విషయంగా జిల్లా జడ్జీ అభివర్ణించారు. బాధితులకు త్వరితగతిన న్యాయం అందడం వలన బాధిత కుటుంబానికి ఆర్థిక తోడ్పాటును కల్పించగలిగామని జిల్లాజడ్జి తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకుల నుండి రుణాలు తీసుకున్న రుణ గ్రహీతలు లోక్ అదాలత్ లో కేసులను పరిష్కరించుకోవడం వలన వారికి, బ్యాంకులకు ఆర్థికలబ్ది చేకూరి దేశప్రగతి బాటలు వేసిన వారుకాగలరని ఆమె అన్నారు. రెండు నెలలకు ఒకసారి పెద్దఎత్తున నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్ లతో పాటు ప్రతిరోజు లోక్ అదాలత్ నిర్వహిస్తు కక్షిదారులకు అందుబాటులో న్యాయసేవలు అందించడం జరుగుతున్న దని ఆమె వివరించారు.

డిప్యూటీ పోలీస్ కమిషనర్ బస్వారెడ్డి మాట్లాడుతూ నేరాలను నియంత్రణకు ప్రతిపౌరుడు పోలీస్ పాత్ర నిర్వహించాలని అన్నారు. మహిళల పట్ల సత్ప్రవర్తన కలిగి ఉండాలని, మద్యం సేవించి మోటారు వాహనాలు డ్రైవ్ చేయరాదని కోరారు. అదనపు జిల్లా కలెక్టర్ అంకిత్ కుమార్ మాట్లాడుతూ.. పాతకాలంలో గ్రామంలో పంచాయతీ ఉండి పరిష్కరించే విధానం ఉండేదని నేడు చట్టబద్ధత కలిగిన లోక్ అదాలత్‌లు రాజమార్గంలో ఇరుపక్షాల మధ్య సయోధ్య కుదిర్చి వివాదాలను పరిష్కరిస్తున్నా యని తెలిపారు. మధ్యవర్తిత్వం మరింత ప్రోత్సహించి కక్షిదారులు వారి కేసులను పరిష్కరించుకునే విధంగా శ్రమిద్దామని ఆయన అన్నారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు జగన్మోహన్ గౌడ్, సీనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్ బాబు, జూనియర్ సివిల్ జడ్జిలు కుషబు ఉపాధ్యాయ్, గోపికృష్ణ, చైతన్య, హరి కుమార్, శ్రీనివాస రావు, ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ మహేశ్వర్ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 14,537 కేసుల పరిష్కారం

జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా నిజామాబాద్ జిల్లాలో 14537 కేసులు పరిష్కరించినట్లు జిల్లా న్యాయసేవాధికారి సంస్థ చైర్మన్, జిల్లా న్యాయమూర్తి సునీత కుంచాల తెలిపారు. లోక్ అదాలత్ సందర్భంగా నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ కోర్టుల పరిధిలో లోక్‌అదాలత్ జరిగినట్టు వెల్లడించారు. న్యాయసేవ ప్రజలకు అందుబాటులో తెచ్చేందుకు వారికి అవగాహన కల్పించడం కోసం ప్రతి రోజు లోక్ అదాలత్ ఉంటుందని న్యాయమూర్తి పేర్కొన్నారు. జిల్లాలో 14537 కేసులను పరిష్కరించామని అందులో భాగంగా 68 రోడ్డు ప్రమాద కేసుల్లో రూ.5 కోట్ల 68 లక్షల 20 వేల అవార్డును జారీ చేసినట్లు తెలిపారు. 389 బ్యాంక్ కేసులను సెటిల్ చేసి రూ.2 కోట్ల 22 లక్షల 85 వేల అవార్డును జారీ చేసినట్లు తెలిపారు. 14 ల్యాండ్ కేసులను సెటిల్ చేసి రూ.61 లక్షల 37 వేల 785 అవార్డును జారీ చేసినట్లు తెలిపారు. 39 సైబర్ క్రైం కేసులను సెటిల్ చేసి రూ.3 లక్షల 4 వేల 894 అవార్డులను జారీ చేసినట్లు పేర్కొన్నారు. బీఎస్ఎన్ఎల్‌కు సంబంధించి 149 కేసులలో రూ.1 లక్షా 11 వేల 885 అవార్డులను జారీ చేసినట్లు తెలిపారు.

బోధన్‌లో 3600 కేసులు పరిష్కారం

బోధన్ : బోధన్ కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. కక్షిదారులకు ఒక కోటి ముప్పై లక్షల ఐదు వందల పది రూపాయలు చెల్లింపు, జరిమానా రూపంలో ఇరవై ఐదు లక్షల ఏడువందల ముప్పై రూపాయలు జమ అయినట్లు కోర్టు అధికారులు తెలిపారు. బోధన్ కోర్టులో నాలుగు బెంచీల ద్వారా ఏర్పాటు చేసి 149 కేసులను పరిష్కారం చేసి, ఒక కోటి 30 లక్షల 54,510 కక్షిదారులకు చెల్లింపు చేశారు.

అదేవిధంగా స్పెషల్ మెజిస్ట్రేట్ కోర్టు (రెండవ తరగతి) 3,451 కేసులు పరిష్కారం చేసి జరిమానా రూపంలో ప్రభుత్వానికి 25 లక్షల 730 రూపాయలు జమ చేశారు.మొదటి బెంచ్ కు న్యాయవాదులు ఎస్ రవికుమార్, డాక్టర్ మధు సింగ్ ,రెండవ బెంచ్ కు న్యాయవాదులు దేవన్ అజయ్ కుమార్, మారుతి రావు కన్నా, మూడవ బెంచికి న్యాయవాదులు ఎం పూజిత, సిహెచ్.వీ. హనుమంతరావు, నాలుగవ బెంచికి న్యాయవాదులు సాయి శివ, జి కళ్యాణి పాల్గొన్నారని బోధన్ మండల న్యాయ సేవ కమిటీ చైర్మన్ ఐదవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

రాజీమార్గమే రాజమార్గం

ఆర్మూర్ : రాజీవ్ మార్గమే రాజమార్గమని, చిన్న చిన్న విషయాలను పెద్దవి చేసుకొని గొడవలకు దిగవద్దని సీనియర్ సివిల్ జడ్జ్ నసీమ్ సుల్తానా అన్నారు. కోర్ట్ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. కార్యక్రమంలో సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ గట్టు గంగాధర్,బార్ అసోసియేషన్ అధ్యక్షులు తెడ్డు నర్సయ్య, ఉపాధ్యక్షులు పోడేటి శంకర్, న్యాయ వాదులు శ్రీధర్, గణేష్, నాగ రాజు, శ్రవణ్, కిరణ్, బ్యాంకు సిబ్బంది, పోలీస్‌లు, తదితరులు పాల్గొన్నారు.



ఆర్మూర్‌లో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి నసీమ్ సుల్తాన

ప్రత్యర్థులతో రాజీ చేసుకోవడమే రాజమార్గం

- జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కె.సుధాకర్

నవతెలంగాణ-కామారెడ్డి



లోక్‌అదాలత్‌లో మాట్లాడుతున్న ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కె.సుధాకర్

ప్రజలు కోట్ల చుట్టూ తిరిగే కంటే తమ పత్యర్థులతో కలిసి రాజీ చేసుకోవడమే రాజా మార్గమని జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కె, సుధాకర్ అన్నారు. శనివారం జిల్లా కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో మొత్తం 3397 కేసులు పరిష్కరించినట్టు తెలిపారు. క్రిమినల్ కేసులు 3335, సివిల్ కేసులు 12, లిటిగేషన్ కేసులు 50 పరిష్కరించినట్టు వెల్లడించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ లోకదాలత్‌లో తమ కేసులను పరిష్కరించుకు నేందుకు చాలామంది రావడం అభినందనీయమని తెలిపారు. జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు, సెకండ్ ఏడిఎం కోర్ట్, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టల యాక్సిడెంట్ కేసులు, కొట్టుకున్న కేసులు, భార్య భర్తల కేసులు, అనేక రకాలైన కేసులను రాజీ పడడంతో కేసులను కొట్టివేశారన్నారు. కార్యక్రమంలో జాతీయ లోక్‌అదాలత్ బెంచ్ మెంబరు న్యాయవాది ఎం.ఏ.సలీం, అంగరాజ్, ఏపీపిఓ అశోక్, పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, కోర్టు సిబ్బంది, స్థానిక పోలీసులు, కక్షిదారులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు పనులు పరిశీలన


పనులను పరిశీలిస్తున్న వినయ్‌రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణం నుంచి ఆలూరు వెళ్లే రోడ్డులో కల్వర్టు, రోడ్డు మరమ్మతుల పనులను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినయ్‌రెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రజలకు రోడ్డును అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

10 సెల్‌ఫోన్లు రికవరీ

- బాధితులకు అప్పగింత


బాధితులకు ఫోన్‌లు అందజేస్తున్న పోలీసులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను రికవరీ చేసి బాధిత యజమానులకు అప్పగించినట్లు రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ సాయిరెడ్డి శనివారం తెలిపారు. ఎస్సై సాయి రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెలలో ట్రైన్‌లలో సెల్‌ఫోన్స్ పోగొట్టుకున్నవారు ఇచ్చిన దరఖాస్తు మేరకు సిఈఐఆర్ అప్లికేషన్ ద్వారా పది ఫోనులను ట్రేస్ చేసి పట్టుకుని బాధితులకు అందజేసినట్టు తెలిపారు. ఎవరైనా ట్రైన్‌లో టికెట్ ఉండి ఫోన్స్ పోగొట్టుకుంటే జీఆర్‌పి రైల్వే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ సూచించారు.

ప్రారంభమైన వీరబ్రహ్మేంద్రస్వామి మహోత్సవాలు


పూజలు చేస్తున్న పలువురు

నవతెలంగాణ-బాల్కొండ

శ్రీశ్రీశ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 20వ వార్షికోత్సవం సందర్భంగా శ్రీ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్రర స్వామి ఆలయంలో ఈ వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నారు. శనివారం పుణ్యవచనం, పంచ కలశ స్థాపన, యజ్ఞం ప్రవీణ్ పంతులు ఆధ్వర్యంలో నిర్వహించారు.

నేడు వీరబ్రహ్మేంద్రస్వామి- గోవిందామాంబల కళ్యాణ మహోత్సవం..

శ్రీశ్రీశ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి-గోవిందా మాంబాల కళ్యాణ మహోత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు తెలిపారు. కళ్యాణాన్ని తిలకించేందుకు మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వీరబ్రహ్మేంద్రస్వామి కళ్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించాలని సంఘం సభ్యులు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం సంఘ సభ్యులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు.

ప్రారంభమైన దత్త జయంతి వేడుకలు

నవతెలంగాణ-బాల్కొండ/మోపాల్

దత్త జయంతిని పురస్కరించుకొని దత్తాత్రేయ సాయిబాబా ఆలయాలల్లో వేడుకలు శనివారం ప్రారంభమయ్యాయి. బోదేపల్లి, చిట్టాపూర్ సాయిబాబా ఆలయాలల్లో దత్తాత్రేయ జయంతి వేడుకలను ఆయా గ్రామాల ఆలయ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. శనివారం పుణ్యవచనం, కలశ స్థాపన యజ్ఞం నిర్వహించారు. ఆదివారం దత్తాత్రేయ జయంతి పూర్ణాహుతి మహా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయా ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ వేడుకలను ఆయా ఆలయ కమిటీ గ్రామాభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు.

నేడు దత్త జయంతి..

మోపాల్ : నగర శివారులోని మాధవ్‌నగర్ సాయిబాబా ఆలయంలో ఆదివారం దత్త జయంతిని ఘనంగా నిర్వహించనున్నారు. ఉదయం 4:30 నిమిషాలకు స్వామివారి అభిషేకం, ఏడు గంటల నుంచి అర్చన కార్యక్రమాలు, హారతి, తీర్థ ప్రసాద వితరణ, అలాగే ఉదయం 9:30 నిమిషాలకు డోలారు కార్యక్రమం, అలాగే సాయంత్రం దత్తసాయి పల్లకి కార్యక్రమం ఉంటుందని, భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ ఈఓ రవీందర్, అర్చక సిబ్బంది ఒక ప్రకటనలో తెలిపారు.

గత ప్రభుత్వం హాస్టళ్లను, వసతి గృహాలను నిర్లక్ష్యం చేసింది

- కమ్మర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలేపు నర్సయ్య


విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

గత ప్రభుత్వం వసతి గృహలను, హాస్టల్స్‌ను నిర్లక్ష్యం చేసి విద్యార్థులను పట్టించుకోలేదని కమ్మర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలేపు నర్సయ్య అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హాస్టల్స్, వసతి గృహాల్లో ఉండే విద్యార్థులకు సరైన భోజనం పెట్టలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత వసతి గృహాలపై ప్రత్యేక శ్రద్ధ వహించి మెస్‌ఛార్జీలు పెంచి, విద్యార్థులకు నాణ్యమైన మంచి భోజనాలు అందజేస్తుందన్నారు. శనివారం మండలంలోని చౌట్‌పల్లిలో ఎస్సీ, బిసి హాస్టల్స్‌ను సందర్శించి యూనిఫాం, డైట్ పథకాన్ని పరిశీలించారు. హాస్టల్స్ విద్యార్థులతో ముచ్చటించారు. ప్రభుత్వం అందిస్తున్న భోజనం సరిగా ఉందా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మంచి భోజనం అందిస్తున్నారని విద్యార్థులు సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా నరసయ్య మాట్లాడుతూ విద్యార్థులకు మంచి ఆహారం పెట్టాలనేదే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలు పునరావృతం కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటోందని తెలిపారు. ప్రభుత్వం అందించే ఆహారం నాణ్యంగా ఉందా? లేదా? అని స్వయంగా హాస్టళ్లకు వెళ్లి పరిశీలించాలని, విద్యార్థులనే అడిగి తెలుసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజాప్రతినిధులకు సూచించారని వివరించారు. విద్యార్థులతోనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందన్నారు. విద్యార్థులను కాపాడుకోవాల్సిన బాధ్యత తమ ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. అనంతరం విద్యార్థులకు యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. విద్యార్థుల కోసం సిద్ధం చేసిన ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సుంకేట బుచ్చన్న, తహసిల్దార్ ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఈనాయత్ నగర్ గ్రామ తాజా మాజీ సర్పంచ్ నునావత్ లస్కర్‌ను బీఆర్ఎస్ మండలాధ్యక్షులు రేగుంట దేవేందర్, నాయకులు శనివారం పరామర్శించారు. ఇటీవల లస్కర్ నానమ్మ నువ్వు నునావత్ కిష్టవ్వ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు తాజా మాజీ సర్పంచ్ నునావత్ లస్కర్, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచారు. కిష్టవ్వ మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కమ్మర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాలవత్ ప్రకాష్, అమీర్‌నగర్ తాజా మాజీ సర్పంచ్ పుప్పాల గంగాధర్, బీఆర్ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షులు కొత్తపల్లి రఘు, నాయకులు రేంజర్ల మహేందర్, బాలకృష్ణ, పద్మశాలి మండల సంఘం అధ్యక్షులు చింత తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలి

- టిజిఎండిసి చైర్మన్ ఈరవత్రి అనిల్
- పలు వసతి గృహాలు పరిశీలన

నవతెలంగాణ-బాల్కొండ


మాట్లాడుతున్న టిజిఎండిసి చైర్మన్ ఈరవత్రి అనిల్

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని టిజిఎండిసి చైర్మన్ ఈరవత్రి అనిల్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచన మేరకు మండల కేంద్రంలోని బాలుర వసతిగృహం, బాలికల వసతిగృహం, మైనారిటీ స్కూల్‌లను తెలంగాణ రాష్ట్ర మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ప్రభుత్వ విప్ ఈరవత్రి అనిల్ శనివారం అధికారులతో కలిసి సందర్శించారు. హాస్టల్లో గల మధ్యాహ్న భోజన వసతులు, మౌలిక సదుపాయాలు విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని అధికారులకు సూచించారు. అనంతరం వసతి గృహాలలో నూతనంగా ఏర్పాటు చేసిన డైట్ మెనూలను ఆవిష్కరించారు. ఇదివరకు ఉన్న డైట్ చార్జీలు 16శాతం ఉండగా ఈ చార్జీలను 40కి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెంచిందని భోజన ఏజెన్సీ నిర్వాహకులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి, తహశీల్దార్ శ్రీధర్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముత్యంరెడ్డి, ఎంపీటీసీ గంగామోహన్, ముప్కాల్ మండలాధ్యక్షుడు ముత్యంరెడ్డి, బాల్కొండ పట్టణ అధ్యక్షుడు సంజీవ్ గౌడ్, మైనారిటీ మండల అధ్యక్షుడు షేక్ జావిద్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తౌటు అరవింద్, వేల్పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఇమ్రాన్ ఖాన్, నాయకులు ప్రవీణ్ గౌడ్, యూనుస్, విద్యాసాగర్, రాజ్ కుమార్,బిట్టు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్స్ డేను విజయవంతం చేయండి

- జిల్లా అధ్యక్షులు కె.రామ్మోహన్‌రావు

నవతెలంగాణ-కంఠేశ్వర్



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు కె.రామ్మోహన్‌రావు

డిసెంబర్ 17న జాతీయ పెన్షన్స్ డే సందర్భంగా నిజామాబాద్‌లోని న్యూ అంబేద్కర్ భవన్‌లో తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెన్షనర్స్ డే సంబరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షులు కె.రామ్మోహన్‌రావు తెలిపారు. శనివారం సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెన్షనర్స్ డే సందర్భంగా రెండు రోజులపాటు ఆటల పోటీలను రిటైర్డ్ ఉద్యోగులకు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. పెన్షన్ అనేది ప్రాథమిక హక్కుగా గుర్తించిన దినంగా డిసెంబర్ 17న దేశవ్యాప్తంగా పండుగలా జరుపుకుంటున్నట్లు ఆయన తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల మూలంగా పెన్షన్ అనేది ప్రమాదంలో పడిందని దానిని కాపాడుకోవడం కోసం పునరంకితం అవటం కోసం ఈ కార్యక్రమాన్ని నిజామాబాద్‌లో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగులందరూ డిసెంబర్ 17 న్యూ అంబేద్కర్ భవన్‌కు ఉదయం 10:30 గంటలకు హాజరు కావాల్సిందిగా, సభను విజయవంతం చేయవలసిందిగా కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అడిషనల్ కలెక్టర్ ఎస్.కిరణ్ కుమార్, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, జాతీయ పెన్షనర్స్ యూనియన్ నాయకులు సంయుక్త గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతరెడ్డి రాజారెడ్డి హాజరవుతున్నట్టు తెలిపారు. అధిక సంఖ్యలో పెన్షనర్లందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మదన్ మోహన్, నిజామాబాద్ డివిజన్ కార్యదర్శి ప్రసాద్‌రావు, జిల్లా నాయకులు హమీదుద్దీన్, రాధా కిషన్, ప్రసాద్, సిర్ప లింగయ్య, డి.లక్ష్మీనారాయణ, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి

లంబాడీలు అంటే ఇంత చిన్న చూపా..?

- లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు చౌహాన్ మోహన్ నాయక్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ లంబాడీలు అంటే ఇంత చిన్న చూపు చూస్తున్నాడని లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చౌహన్ మోహన్ నాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. లగచర్ల పులిచర్ల కుంట తండాకు చెందిన హీర్యానాయక్ 'మా భూములు ఇవ్వం' అన్నందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లంబాడీలను ఏదోరకంగా భయ భ్రాంతులకు గురి చేసి భూములను తీసుకోవాలని ప్రయత్నిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ప్రజలకు అండగా ఉండాలి కానీ భయభ్రాంతులకు గురిచేసి వారి ప్రాణాలతో చెలగాటమాడటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వెంటనే లగచర్ల బాధిత లంబాడి రైతులను బేషరతుగా విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఆహార పదార్థాలు, వంటనూనెల్లో కల్తీపై

వినియోగదారుల చైతన్య సదస్సు

- సీసీసీ జిల్లా కన్వీనర్ రాజుల రామనాథం

నవతెలంగాణ-బాల్కొండ

జాతీయ వినియోగదారుల హక్కుల వారోత్సవాలు ఈనెల 18 నుంచి 24 వరకు ఆర్మూర్ మండల కేంద్రంలో నిర్వహణలో భాగంగా 19న ఆర్మూర్‌లో 'ఆహార పదార్థాలు, వంట నూనెల్లో కల్తీ - వినియోగదారుల చైతన్య సదస్సు'ను ఏర్పాటు చేస్తున్నట్లు వినియోగదారుల సౌత్ కమిటీ నిజామాబాద్ జిల్లా కన్వీనర్ రాజుల రామనాథం తెలిపారు. నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల్లోని అన్ని మండలాల ప్రతినిధులు తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు. ఈ సదస్సులో సంబంధిత అధికారులు, రాష్ట్ర స్థాయి వినియోగదారుల ప్రతినిధులు హాజరవుతున్నారని జిల్లా కన్వీనర్ రాజుల రామనాథం, కోకన్వీనర్ వి.యన్.వర్మ తెలిపారు.



కన్నుల పండువగా వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని కోనసముందర్‌లో స్థానిక గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీదేవి భూదేవి సహిత శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామివారి కళ్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, పంచామృత అభిషేకం, అలంకరణ, పుణ్యవచనం, గణపతి హోమం కార్యక్రమాలు నిర్వహించారు. గరుడ కళ్యాణం, నది జలాలతో స్వామి వారి వసంతోత్సవం అలంకరణ, స్వామి వారి ఎదుర్కోలు, స్వామివారి కళ్యాణ అనంతరం రథోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సహిత శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవానికి స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి వీక్షించారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు కాంతి సాయన్న, ఉపాధ్యక్షులు ఎలిషాల భూమయ్య, సహకార్యదర్శి కొలిపాక ఎల్లయ్య, క్యాషియర్ రాజగంగారాం, గ్రామ కమిటీ సభ్యులు దుంపల విజయకుమార్, సామ రాజేశ్వర్ రెడ్డి, ఎంపీ గౌడ్, అర్చకులు అనుదీప్ శర్మ సుధాకర్ శర్మ, నరేందర్ శర్మ, గ్రామ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహం తనిఖీ


భోజనశాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారిని

నవతెలంగాణ-బాల్కొండ

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మోడల్ స్కూల్ బాలికల వసతి గృహాన్ని మండల వ్యవసాయాధికారిని లావణ్య శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలో అమలవుతున్న మెనూ ప్రకారం విద్యార్థులకు అందిస్తున్న భోజనంపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వంటగదిలోని పదార్థాల నిల్వలను తనిఖీ చేశారు. అనంతరం ఏవో లావణ్య, హాస్టల్ కేర్ టేకర్ వీణ విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

ఎస్జీటీల సమావేశం

నవతెలంగాణ-వేల్పూర్(ఆర్మూర్)

మండల ఎస్జీటీల సమావేశాన్ని మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి గంగాప్రసాద్ సమక్షంలో వేల్పూర్ ఎస్‌జీటిల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా శ్యాంసుందర్, ప్రధాన కార్యదర్శిగా సునీల్, కోశాధికారిగా నరేందర్, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్, రోజామణి, హనీష్, శ్రీకాంత్, కిషన్, చంద్రశేఖర్ ఇతర కార్యవర్గ సభ్యులున్నారు. ఈ కార్యక్రమంలో భీంగల్ మండలాధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నవీన్ కుమార్, హరీష్, ఆర్మూర్ మండలాధ్యక్షులు పొన్న ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం



నవతెలంగాణ-ఆర్మూర్

తెలంగాణ సోషల్ వెల్ఫేర్ మహిళా డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన డైట్ మెనూ లంచ్ ప్రోగ్రాంలో భాగంగా కళాశాల నుంచి స్పోర్ట్స్‌లో నేషనల్ లెవెల్, ఇంటర్నేషనల్ లెవెల్‌లో ఎంపికైన విద్యార్థులకు నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రొద్దుటూరు వినయ్‌రెడ్డి శనివారం శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబాగౌడ్, చైర్మన్ రేగుల సత్యనారాయణ, డిసిఎంఎస్ డైరెక్టర్ వాసు, మాజీ వైస్ చైర్మన్ లింగగౌడ్, భూపేందర్, చిట్టి రెడ్డి, వడ్లూరి సుమన్, నటరాజు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ


నివాళులర్పిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని ఏఆర్‌పి క్యాంప్ గ్రామానికి చెందిన గణవేని చంద్రయ్య ముదిరాజ్ అకాల మరణం పట్ల ఎడపల్లి మండలం ముదిరాజ్ సంఘం నాయకులు శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. మృతుని కుటుంబానికి మనోధైర్యాన్ని నింపారు. ఎడపల్లి మండల ముదిరాజ్ కమిటీ అధ్యక్షులు సున్నపు వడ్డెన్న, ప్రధాన కార్యదర్శి జనార్దన్, కార్యదర్శి సున్నపు అశోక్, ఉపాధ్యక్షులు ఆంజనేయులు, నర్సింలు, కృష్ణ, గణవేని చంద్రయ్య కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడు చంద్రయ్య కుటుంబానికి మనోధైర్యాన్ని నింపారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు.

ప్రజల సమస్యలు పరిష్కరించాలి

- ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష


రిలే నిరాహార దీక్ష చేస్తున్న ధర్మ సమాజ్ పార్టీ

నవతెలంగాణ-బాల్కొండ

పేద మధ్యతరగతి వర్గాలైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని బాల్కొండ మండల కేంద్రంలో ధర్మ సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు నిశాంత్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిశాంత్ మాట్లాడుతూ.. పేద మధ్యతరగతి వర్గాలైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ ప్రజలకు విద్యా వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు సాధనకై వినతిపత్రాలను అందజేసినా ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేదని, దీనికి నిరసనగా ఈనెల 16వ తేదీన ఆమరణ నిరాహార దీక్ష చేయడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. ఈ నిరాహార దీక్షకు బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు కే భోజన్న, బీఆర్ఎస్ ఆర్మూర్ మండల అధ్యక్షుడు క్రాంతి, అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షులు లింగన్న సంఘీభావం ప్రకటించారని అన్నారు. కార్యక్రమంలో డిఎస్పి జిల్లా నాయకులు మురళి, మండల నాయకులు వినోద్, రంజిత్, సాయిరాం, శేఖర్, రాజు, రవి, పెంటన్న కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన


ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న పలువురు

నవతెలంగాణ-బోధన్

ఎయిడ్స్ నియంత్రణపై శనివారం బోధన్ పట్టణంలో ఐసీడీఎస్ కౌన్సిలర్ రాజన్న అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విచ్చలవిడిగా లైంగిక సంబంధాలను ఏర్పరుచుకుంటూ జీవితాలను నాశనం చేసుకోవద్దని ఐసిటిసి కౌన్సిలర్ రాజన్న సూచించారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో సుఖవ్యాధులపై ఆయన అవగాహన కల్పించారు. బోధన్ పట్టణంలోని రాకాసిపేట్, కొత్త బస్టాండ్, అంబేద్కర్ చౌరస్తా వద్ద ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విచ్చలవిడిగా శారీరక సంబంధాలు ఏర్పాటు చేసుకోవడం వలన ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తి చెందుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ హెచ్ఐవీ పరీక్ష చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్నేహ సొసైటీ సిబ్బంది బాలరాజు, సావిత్రి, వర్డ్ ఆర్గనైజేషన్ సిబ్బంది చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తులు పంపిణీ


విద్యార్థులకు దుస్తులు అందజేతస్తు ఎమ్మెల్యే

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని సమీకృత బాలికల హాస్టల్‌లో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి విద్యార్థులకు నూతన దుస్తులు శనివారం అందించారు. అనంతరం ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న భోజన మెనూను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రణాళికతో భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వంటలను పరిశీలించారు. మెనూ ప్రారంభోత్సవం సందర్భంగా విద్యార్థులు దేశ భక్తి పాటలపై చేసిన నృత్య ప్రదర్శనలు అందరినీ అలరించాయి. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్మన్ తూము పద్మా శరత్ రెడ్డి, డిసిసి డెలిగేట్ బి.గంగాశంకర్, అధికారులు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి
ఆదివారం | డిసెంబర్ 15, 2024 | www.navatelangana.com

కోకాపేటకు తరలిన కురుమ సంఘం నాయకులు



నవతెలంగాణ-రామారెడ్డి

కోకాపేటలో నిర్మించిన దొడ్డి కొమరయ్య ఆత్మగౌరవ భవన ప్రారంభోత్సవానికి శనివారం మండలంలోని కురుమ సంఘం నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... తెలంగాణ సాయుధ పోరాటంలో దొడ్డి కొమురయ్య త్యాగం మరువలేనిదని, దొడ్డి కొమరయ్య వారసులుగా ఆయన ఆశయ సాధనకు కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు కందూరి లింబాద్రి, జీర్ల మహేష్, చెలిమేటి గంగాధర్, కందూరి సుమన్, పల్లె మహిపాల్ తదితరులు తరలి వెళ్లారు.

శాంతి ర్యాలీ



నవతెలంగాణ-ఎడపల్లి

25న జరుపనున్న క్రిస్మస్ పండగ వేడుకల శుభ సందర్భంగా బోధన్ పట్టణంలో నియోజకవర్గ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి చేతుల మీదుగా శాంతి ర్యాలీ శనివారం నిర్వహించారు. పట్టణంలోని అనీషా నగర్ చర్చి వద్ద ప్రారంభమైన బోధన్ పట్టణానికి చేరుకుంది. ర్యాలీలో ఎడపల్లి, బోధన్, చుట్టుపక్కల గ్రామాల క్రైస్తవ సోదరులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



భిక్కనూర్: మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి



కామారెడ్డి: విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎస్పీ



లింగంపేట్‌లో...

డైట్ చార్జీల పెంపుతో

విద్యార్థులకు నాణ్యమైన భోజనం

నవతెలంగాణ-విలేకరుల బృందం

భిక్కనూర్ : బిసి హాస్టల్, సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల లను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వసతి గృహాల డైట్ చార్జీలు పెంచడం అభినందనీయమని సాంఘిక గురుకుల పాఠశాల, బీసీ హాస్టల్లో న్యూ కామన్ డైట్ మెనూ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నిత్యవసర ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచడం వల్ల విద్యార్థులకు నాణ్యత మైన భోజనం అందుతుందన్నారు. డి ఎల్ పి ఓ శ్రీనివాస్, ఎంపీడీవో రాజ్ కిరణ్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మహేష్ గౌడ్, హాస్టల్ వార్డెన్ సునీత, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చదువుతో ఏదైనా సాధించవచ్చు: జిల్లా ఎస్పీ సింధు శర్మ

కామారెడ్డి : విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధి కోసం పౌష్టికాహార ప్రణాళికను అమలు చేస్తూ, వారికి మంచి ఆరోగ్య భవిష్యత్తును అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళిక రూపొందించినట్లు జిల్లా ఎస్పీ సింధుశర్మ తెలిపారు. నూతన మెను పట్టిక విధానంలో విద్యార్థులకు నాణ్యమైన పౌష్టిక ఆహారం అందించాలనే ఉద్దేశ్యంతో రెసిడెన్షియల్ పాఠశాలలు, కస్తూర్బా గాంధీ విద్యాలయాలు ఆశ్రమ పాఠశాలలు మోడల్ స్కూల్స్‌లలో ప్రభుత్వం డైట్ చార్జీలు 40 శాతం పెంచి అన్ని సంక్షేమ హాస్టళ్లలో ఒకే విధమైన మెనూ పాటించాలని, కాస్మోటిక్స్ చార్జీలు 200 శాతం పెంచి విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని తెలిపారు. శనివారం ఇతర ప్రభుత్వ అధికారులతో కలిసి కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ కాలేజ్‌లో హాజరై విద్యార్థుల తో మాట్లాడి అనంతరం విద్యార్థులకు అందిస్తున్న ఆహారం పరిశీలించి పలు సూచనలు చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.... విద్యార్థి దశ నుండి క్రమశిక్షణ, మంచి నడవడికతో ఉపాధ్యాయులు చెప్పే పాఠలు, మంచి విషయాలు శ్రద్ధ గా విని మంచిగా చదువుకొని భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో ఉండాలన్నారు. జీవితంలో మంచిగా చదవడం వల్ల ఏదైనా సాధించవచ్చు అని ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చు అన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీ గురుకుల పాఠశాలలో కొత్త మెనూ

గాంధారి : మండల కేంద్రంలోని బీసీ, ఎస్సీ, ఎస్టి హాస్టల్‌లో, ఏకలవ్య గురుకుల పాఠశాలలో ప్రభుత్వం కొత్త మెనూ ప్రవేశ పెట్టింది. శనివారం బీసీ సంక్షేమ హాస్టల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కొత్త మెనూ విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి సహభోజనాలు చేశారు. ఈ సందర్భంగా బీసీ హాస్టల్ వార్డెన్ నవీన్ మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యార్థులకు అన్ని రకాలైన సౌకర్యాలు కల్పిస్తున్నాయని తెలిపారు.

న్యూ మెనూ కాస్మోటిక్ చార్జీలను పెంచిందని, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగించు కోవాలన్నారు. విద్యార్థులు బంగారు భవిష్యత్తును ఏర్పరచుకొని ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రవి కుమార్, మండల విద్యాధికారి శ్రీహరి, ఎస్సీ హాస్టల్ వార్డెన్ శంకర్, ఏకలవ్య స్కూల్ ప్రిన్సిపల్ సురేష్ చంద్ర, డీఎఫ్ఓ నికిత, తదితరులు పాల్గొన్నారు.

సదాశివనగర్ : మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో కలెక్టర్ ఆదేశాల ప్రకారం కాస్మోటిక్ చార్జి పెంపుదలను ప్రత్యేకాధికారి చందర్ నాయక్ ఆవిష్కరించారు. అనంతరం కుప్రియాల్ స్టేజ్ వద్ద గల మహాత్మా గాంధీ జ్యోతిరావు పూలే పాఠశాలలో కూడా ఆవిష్కరించారు. తల్లిదండ్రులు, విద్యార్థులు అందరూ భోజనాలు నిర్వహించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంతోష్ కుమార్, ఎంపీఓ నరేందర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్‌లు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట్ : మండల కేంద్రంలోని మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలను ఎంపీడీవో నరేష్ మైనార్టీ జూనియర్ కళాశాల బీసీ గురుకులం రెసిడెన్షియల్ పాఠశాలను ఎమ్మార్వో నరేందర్‌లు సందర్శించారు. విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ చార్జిల పెంపుదల ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ఎనిమిది సంవత్సరాల తర్వాత డైట్ చార్జీలను 40 శాతం మరియు 16 సంవత్సరాల తర్వాత కాస్మోటిక్ చార్జీలు 200 శాతం పెంచడం సంతోషకరమన్నారు. ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని విద్యార్థుల వసతులు కల్పించాలని ఉద్దేశంతో పెంచుతుందని తెలిపారు. విద్యా వ్యవస్థను బలపరచడం కోసం ప్రభుత్వం కంకణం కట్టుకుందని పేర్కొన్నారు.

విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోని ఉజ్వల భవిష్యత్తుకు మంచి పునాది వేసుకోవాలని సూచించారు. ఎస్సీ బాలుర వసతిగృహం ఎంఈఓ షౌకత్ అలీ పాల్గొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్‌లు వెంకట్ రాములు, మధుసూదన్‌రావు, మంజుల, ఉపాధ్యాయులు, విద్యార్థులతల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య, భోజనం అందించాలి

- జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి




మాట్లాడుతున్న నారెడ్డి మోహన్‌రెడ్డి

నవతెలంగాణ-రామారెడ్డి

ప్రభుత్వం గురుకులాలకు, వసతి గృహాలకు పెంచిన చార్జీలతో నాణ్యమైన విద్య, భోజనాన్ని విద్యార్థులకు అందించాలని జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి ప్రిన్సిపాల్, వార్డెన్‌లకు సూచించారు. శనివారం మండలంలోని ఉప్పల్వాయి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల షెడ్యూల్ కులాల వసతి గృహాలను జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు గీ రెడ్డి మహేందర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. విద్యార్థులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని, లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకొని విద్యను అభ్యసించి ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శివరాం, వైస్ ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి, వార్డెన్ నాగరాజు, విద్యార్థులు, తదితరులు ఉన్నారు.

ఎస్ఎస్‌సి జిడికి భగత్ ఎంపిక



నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని పద్మాజి వాడి గ్రామానికి చెందిన మామిండ్ల భగత్ ఎస్ఎస్‌సి జిడిలో సిఐఎస్ఎఫ్ ఉద్యోగానికి ఎంపికైనట్లు గ్రామస్తులు తెలిపారు. శనివారం ఫలితాలు వెలువడ్డాయి. తల్లిదండ్రులు సవిత లింగంకు ఇద్దరు కుమారులు కాగా.. చిన్న కుమారుడు మామిండ్ల బాను రెండు సంవత్సరాల క్రితం అగ్నివీర్‌కు ఎంపికైయ్యాడు. పెద్దకుమారుడు సైతం ఎస్ఎస్‌సీ జీడీకి ఎంపిక కావడంతో గ్రామస్తులు అభినందిస్తున్నారు.

బూత్ కమిటీల నియామకం

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలో శనివారం బీజేపీ నూతన బూత్ కమిటీల నియమించినట్లు మండల అధ్యక్షుడు కుంటారామిరెడ్డి తెలిపారు. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గం సదాశివ నగర్ గ్రామంలో బూత్ 59 ధర్మారెడ్డి 60 కటికే మహేష్ 61 బాయికాడ నారాయణ 62 గంగుల నవీన్ 63 వడ్ల వంశీ నియమించినట్లు తెలిపారు. శక్తి కేంద్ర ఇన్చార్జిలు నల్ల సత్యం రెడ్డి ఏనుగు జైపాల్ రెడ్డి నియమించినట్లు తెలిపారు. సంపూర్ణ సభ్యత్వ ప్రక్రియ మండల అధ్యక్షులు కుంట రామిరెడ్డి ఉపాధ్యక్షులు చక్రధర్ గౌడ్ సమక్షంలో ఈ కార్యవర్గం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

క్రమశిక్షణ, అంకితభావంతో చదవాలి

- అదనపు కలెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-రామారెడ్డి

విద్యార్థులు క్రమశిక్షణ, అంకితభావంతో చదవాలని అదనపు కలెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో కామన్ డైట్ ఆవిష్కరించడానికి ముఖ్య అతిథి గా పాల్గొన్నారు. షెడ్యూల్ కులాల వసతి గృహంలో ఎమ్మా ర్వో సువర్ణ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులను చిన్నచిన్న పండ గలకు ఇంటికి తీసుకెళ్లవద్దని తల్లిదండ్రులకు సూచించారు. విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియో గించు కోవాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల చదువుల కు సహకరించాలని సూచించారు. తల్లిదండ్రులతో పాటు విద్యారులతో కలిసి సహ భక్తి భోజనం చేశారు. గురుకు లంలోని సౌక ర్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శివరాం, వైఎస్ ప్రిన్సిపాల్ ఎన్.మోహన రెడ్డి, షెడ్యూల్ కులాల వసతి గృహ వార్డెన్ నాగరాజు, ఎంపీడవో తిరుపతిరెడ్డి, ఆర్ఐ రమా కాంత్, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

అమరవీరుల సాక్షిగా.. ఇచ్చిన హామీ నెరవేర్చండి

- సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్

నవతెలంగాణ-కామారెడ్డి

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అమరుల సాక్షిగా ఇచ్చిన హామీలు నెరవేర్చాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు డిమాండ్ చేశారు. శనివారం నాటికి సమగ్ర శిక్ష ఉద్యోగులు నిరవధిక సమ్మెలో భాగంగా ఐదవ రోజు సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సంపత్ ఆధ్వర్యంలో చెవిలో పువ్వుతో మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. జనగామ జిల్లా ఎంఈఓ కార్యాలయంలో మెసెంజర్‌గా విధులు నిర్వహిస్తున్న మారుపేల్లి యకయ్య శుక్రవారం నిలవధిక సమ్మెలో పాల్గొని ఇంటికి వెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందాడని తెలిపారు. అతని అకాల మరణనికి సమగ్ర శిక్ష ఉద్యోగులు అశ్రునివాళి, శ్రద్ధాంజలి ఘటించారు. ఐదవ రోజు సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరవధిక సమ్మెకు డిటిఎఫ్ బాధ్యులు దేవుల శ్యాం కుమార్, సురేష్, విట్టల్, పిఆర్టియు తెలంగాణ జిల్లా బాధ్యులు అంబీర్ మనోహర్ రావు, లక్ష్మీనారాయణ, ధర్మ సమాజ్ పార్టీ జిల్లా బాధ్యులు హాజీరే మద్దతు తెలిపారు.



మాట్లాడుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

మదన్‌మోహన్‌కు మంత్రిపదవి ఇవ్వాలి

- కాంగ్రెస్ నాయకుల పాదయాత్ర, పూజలు

నవతెలంగాణ-గాంధారి

ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావుకు రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం కల్పించాలని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు విజ్ఞప్తి చేశారు. శనివారం మండల కేంద్రంలోని భోగేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండల కేంద్రం నుంచి పోతంగల్ గ్రామంలోని బుగ్గ రామేశ్వరం ఆలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. బుగ్గ రామేశ్వర ఆలయంలో మంత్రివర్గంలో స్థానం రావాలని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు తూర్పు రాజు మాట్లాడుతూ.. నియోజవర్గం అభివృద్ధి చెందాలంటే ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇవ్వాలని మంత్రి అయితే నియోజవర్గం అభివృద్ధి చెందుతుందన్నారు. మదన్ మోహన్ కు మంత్రివర్గంలో స్థనం కల్పించాలని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీకి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు సర్దార్ నాయక్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు బాలరాజు, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి లైన్ రమేష్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల లక్ష్మణ్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సర్దార్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బిస గణేష్, యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రవీణ్ గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బండారి పరమేష్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మోహన్ నాయక్, మాజీ సర్పంచ్ మమ్మాయి సంజీవ్ యాదవ్ పాల్గొన్నారు.



భోగేశ్వర ఆలయంలో పూజలు నిర్వహించి బుగ్గ రామేశ్వరం ఆలయానికి పాదయాత్రగా వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు

17న చలో హైదరాబాద్ విజయవంతం చేయాలి

- విజ్ఞాన్ వికలాంగుల సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షులు

నవతెలంగాణ-కామారెడ్డి

17న దివ్యాంగుల చలో హైదరాబాద్ విజయవంతం చేయాలని విజ్ఞాన్ వికలాంగుల సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షులు చిప్ప దుర్గాప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల పక్షానికి వినతి పత్రాలు ఇవ్వడానికి ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారన్నారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో పెన్షన్ రూ.6000, ఉచిత రావాణా సౌకర్యం, 2016 దివ్యాంగుల చట్టం పూర్తి స్థాయిలో అమలు, బ్యాక్ లాగ్ ఉద్యోగాల భర్తీ, ఉన్నత విద్య ఉద్యోగాల రిజర్వేషన్లు, అమలు చేయాలని డిమాండ్‌తో వెళ్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సబ్ కమిటీ చైర్మన్ వంగ ఈశ్వర్, వైస్ చైర్మన్ నితీష్ రెడ్డి, సీనియర్ నాయకుడు రంగ్యానాయక్, పాల్గొన్నారు.

దాత సహకారంతో నీటి సౌకర్యం ఏర్పాటు

నవతెలంగాణ-తాడ్వాయి

మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయ భక్తుల నీటి సౌకర్యం కోసం ఉపాధ్యాయులు రామగోనోళ్ళ రాజా గౌడ్ 25 వేల రూపాయల విరాళం శనివారం అందించినట్లు ట్రస్టు సభ్యులు తెలిపారు. ఆలయ ప్రాంతంలో నల్లాలు అమర్చినట్లు తెలిపారు. దీంతో భక్తులకు నీటి ఇబ్బందులు తప్పినట్లు అయిందని గ్రామస్తులు తెలిపారు. ఇకముందు కూడా ఆలయ అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు డి సంగారెడ్డి. ఆకిటి రాజారెడ్డి జె., బాగా రెడ్డి, ఎస్ రనీల్ రెడ్డి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దత్త జయంతి వేడుకలు

నవతెలంగాణ-గాంధారి/పోతంగల్/కామారెడ్డి

మండంలంలోని గౌరారం గ్రామంలోని ఆంజనేయ ఆలయంలో దత్త జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గాంధారి మండల కేంద్రంలోని దత్త జయంతిని పురస్కరించుకుని గ్రామస్తులు దత్తాత్రేయ మందిరంలో ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు.

అన్న ప్రసాదం పంపిణీ..

పోతంగల్ :మండల కేంద్రంలోని సాయిబాబా మందిరంలో దత్తాత్రేయ స్వామి ఉత్సవాలు శనివారం నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా బస్వంత్ అన్నప్రసాదం పంపిణీ చేశారు.

దత్త జయంతిలో పాల్గొన్న ఎమ్మెల్యే

కామారెడ్డి : కామారెడ్డిలోని 35వ వార్డులో(దేవునిపల్లి) దత్త జయంతి సందర్భంగా దత్తాత్రేయ ఆలయంలో ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి దర్శించుకున్నారు. ఎమ్మెల్యేను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు.

ఆర్థిక సహాయం అందజేత

నవతెలంగాణ-పోతంగల్

మండల కేంద్రంలో నిరుపేద కుటుంబానికి చెందిన అనిఫా బేగం(50)కు కంటి చూపు తగ్గడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. ఆ విషయం తెలుసుకున్న సామాజిక సేవ కర్త ఎంఎ హకీమ్ కంటి చూపు ఆపరేషన్ కోసం ఆర్థిక సహాయం చేశారు. రెండవ కంటికి కూడా ఆరు నెలల తర్వాత ఆపరేషన్‌కు సహాయం చేస్తానని కుటుంబ సభ్యులకు మాట ఇచ్చారు. అలాంటి సేవలు, నిరుపేదలకు చేయటానికి ముందు ఉంటాననీ పేర్కొన్నారు. కార్యక్రమంలో షేరు, గాఫర్, తదితరులు ఉన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

నవతెలంగాణ-కామారెడ్డి

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇస్తానన్న హామీలను వెంటనే నెరవేర్చాలని ఎంసిపీఐయు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వనం సుధాకర్ అన్నారు. శనివారం జిల్లా జనరల్ బడి సమావేశాన్ని జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని నెరవేర్చకుండా విజయోత్సవలు జరపడం ఎంతవరకు సమంజసమని అన్నారు. నిరుద్యోగ సమస్య, విద్య, వైద్యం గాలికి వదిలేసి కుర్చీల కొట్లాటలో ప్రభుత్వం కూరుకుపోయిందన్నారు. ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని లేని పక్షంలో ఆరు గ్యారెంటీల విషయంలో పెద్ద ఎత్తున జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి జబ్బర్ నాయక్, జిల్లా కమిటీ సభ్యులు నరసింహులు, రమేష్, నీల సుజాత, భార్గవి, రాజు, రాజమణి, కుమ్మరి రమేష్, భూమయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తు వివరాల సేకరణ

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లా కేంద్రంలోని 47వ వార్డు పరిధిలో గతంలో ప్రజాపాలనా ఫారంలో ఇందిరమ్మ ఇళ్ల కోరకు దరఖాస్తు చేసుకున్న వారి పేర్లు వివరాలు సేకరించి అన్‌లైన్‌లో మున్సిపల్ అదికారి వహబ్ పొందుపరుస్తున్నారు. ఈ కార్యక్రమన్ని స్థానిక 47వ వార్డు కౌన్సిలర్ గెరిగంటి స్వప్న లక్ష్మినారాయణ పర్యవేక్షించారు. అర్హులైన అందరి పేర్లను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని మున్సిపల్ అధికారికి సూచించారు.

పిసిసి అధ్యక్షున్ని కలిసిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-లింగంపేట్

పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్‌ను రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు గాంధీభవన్‌లో మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. మాజీ పార్లమెంట్ సభ్యులు మాజీ మంత్రి రాష్ట్ర బీసీ సంఘం మాజీ అధ్యక్షులు క్రీర్తి శేషులు తాడూరి బాలా గౌడ్ మనవడు తాడూరి అనిల్ కుమార్‌గౌడ్ టిపిసిసి మైనార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పతియోద్దీన్‌లు ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పిసిసి పగ్గాలు చేపట్టినందుకు శుభాకాంక్షలు తెలిపారు. ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి తదితర అంశాల గురించి పిసిసి అధ్యక్షులకు అనిల్ కుమార్ గౌడ్ వివరించారు. నియోజకవర్గంలో చేపట్టే పలు అంశాల గురించి పిసిసి అధ్యక్షులతో చర్చించారు. ఆయన సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు.

రైతుల సమస్యలపై అసెంబ్లీలో చర్చించండి

నవతెలంగాణ-కామారెడ్డి

రైతుల సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలని భారతీయ కిసాన్ సంగ్ ప్రతినిధులు కోరారు. శనివారం ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతులకు రెండు లక్షల రుణమాఫీ, రైతు భరోసా, రైతు బీమా వివిధ సమస్యలపై అసెంబ్లీలో చర్చించడానికి ఎమ్మెల్యేకు మెమోరాండం ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా అధ్యక్షులు పైడి విట్టల్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంబీర్ ఆనంద్ రావు, జోనల్ అధ్యక్షులు లొంక వెంకట్‌రెడ్డి, బికేఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

గర్భిణీకి రక్తదానం అంజేత

నవతెలంగాణ-కామారెడ్డి

పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహేశ్వరి అనే గర్భిణీ మహిళకు ఆపరేషన్ నిమిత్తం అత్యవసరంగా రక్తం అవసరమైంది. కుటుంబసభ్యులు జిల్లా రక్తదాతల సేవా సమితి నిర్వాహకులను సంప్రదించడంతో వెంటనే స్పందించిన కేంద్రానికి చెందిన ముదాం నర్సింలు ఒక ప్రాణాన్ని వెంటనే వచ్చి రక్తం అందజేశారు. ఈ సందర్భంగా నర్సింలు మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలని తెలిపారు. రక్తదానం చేసిన నర్సింలుకు జిల్లా రక్తధాతల సేవా సమితి నిర్వాహకులు బోనగిరి శివకుమార్, ముదాం శ్రీధర్ పటేల్, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీధర్‌లు ధన్యవాదాలు తెలిపారు.

భవన నిర్మాణ రంగ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

నవతెలంగాణ-కామారెడ్డి

భవన నిర్మాణ రంగాల కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని సంఘం జిల్లా కమిటీ అధ్యక్షులు శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. జిల్లాకేంద్రంలోని సంఘం కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. జిల్లా సమావేశంలో జిల్లా కమిటీ సభ్యుల, మండల ఇన్చార్జిలను నియమించారు.

మెస్ జాబితాను పరిశీలించిన ఎంఈఓ



నవతెలంగాణ-రెంజల్

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని బీసీ బాలికల వసతి గృహాన్ని మండల విద్యాశాఖ అధికారి కట్ట ఆంజనేయులు శనివారం ఆకస్మికంగా సందర్శించి విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఆదేశించారు. ప్రభుత్వం విద్యార్థుల కోసం కోట్లాది రూపాయలను కేటాయిస్తుందని, వారికి పరిసరాలను పరిశుభ్రతగా ఉంచడంతోపాటు, పౌష్టికాహారాన్ని అందించాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వసతి గృహంలోని విద్యార్థులను తమ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమకు ఎలాంటి సమస్యలు ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆయన వెంట వసతిగృహం సిబ్బంది, విద్యార్థి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితను కలిసిన బినోల సొసైటీ చైర్మన్

నవతెలంగాణ-నవీపేట్

మండలంలోని బినోల సొసైటీ చైర్మన్ మగ్గరి హన్మాన్లు కుటుంబ సమేతంగా ఎమ్మెల్సీ కవితను హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. తన పుట్టినరోజు సందర్భంగా తన అభిమాన నాయకురాలు తన రాజకీయ జీవితానికి పునాది వేసిన ఎమ్మెల్సీ కవితను కలవడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. జీవితాంతం ఆమె అడుగుజాడల్లోనే నడుస్తానని ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం తిరుమల ప్రసాదాన్ని ఆమెకు అందించారు.


ఎమ్మెల్సీ కవితను కుటుంబ సమేతంగా కలిసిన చైర్మన్

కేజీబీవీ విద్యార్థులకు బ్లాంకెట్స్ అందజేత

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండల కేంద్రంలోని కేజీబీవీ స్కూల్ విద్యార్థులకు ఎంఈఓ శ్రీనివాస్ బ్లాంకెట్స్‌ను అందజేశారు. కేజీబీవీ పాఠశాలను సందర్శించి అల్పాహారాన్ని, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ప్రభుత్వం ద్వారా వచ్చిన బ్లాంకెట్స్‌ను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చదువు పట్ల పలు సూచనలు చేశారు.

ఈగ సంజీవరెడ్డికి సన్మానం


సన్మానించిన నాయకులు

నవతెలంగాణ-మోపాల్

నిజామాబాద్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు ఈగ సంజీవరెడ్డి ఇటీవల జరిగిన తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ ఎన్నికలలో రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికవడంతో పలువురు నాయకులు ఆయనను శనివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మోపాల్ మండల నాయకులు ముత్తెన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గురువారం వార సంత

- పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న స్థానిక యువత

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలో ప్రతి గురువారం వారాంతపు సంత ఏర్పాటు చేయడానికి వ్యాపారస్తులు, గ్రామ పెద్దలు, కుల సంఘాలు, ఆలయ కమిటీ సభ్యులు తమ సహాయ సహకారాలను అందించి సంతకు సహకరించాలని యువత పిలుపునిచ్చారు. శనివారం రామాలయంలో స్థానిక యువత వారాంతపు సంత పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామస్తులకు వారాంతపు సంతను నిర్వహించినట్లయితే వ్యాపారస్తులు తమ సరుకులను ఇక్కడికి తీసుకు వస్తారని వారికి గ్రామస్తులు సహాయ సహకారాలు అందించాలన్నారు. ఈ సంత ఏర్పాటు వల్ల గ్రామ అభివృద్ధితో పాటు, సరసమైన ధరలకు వస్తువులు కొనుగోలు చేసే అవకాశం గ్రామస్తులకు కలుగుతుందన్నారు. ఈనెల 19 న సంతను ప్రారంభించడానికి తమ సహాయ సహకారాలు అందించాలని వారు కోరారు.

మల్లారం లింగేశ్వర ఆశ్రమంలో మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్ ప్రత్యేక పూజలు


మాజీ ఎమ్మెల్సీని సన్మానించిన పలువురు

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

మండలంలోని మల్లారం లింగేశ్వర ఆశ్రమం శ్రీ శ్రీ కృష్ణ పిట్ల మహారాజ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ వి గంగాధర్‌గౌడ్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షులు మీసాల మధుకర్ రావు, జెడ్పిటిసి గోపాల్ రెడ్డి, వైస్ ఎంపీపీ అన్నం సాయిలు, మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు అశోక్, ఎస్టీ సెల్ మండలాధ్యక్షులు బానోత్ గోపాల్ నాయక్, పార్టీ సీనియర్ నాయకులు రాయడి బాల్‌రాజ్, మాజీ సర్పంచ్ అనూష లక్ష్మణ్, శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు గంగాధర్‌గౌడ్, గంగాధర్, సంతోష్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ బాలుర కబడ్డీ సెలక్షన్స్

నవతెలంగాణ-ముప్కాల్

జనగామ జిల్లా కేంద్రంలో ఈ నెల 27 నుంచి 30 తేదీ వరకు జూనియర్ అండర్-20 బాలుర ఇంటర్ డిస్ట్రిక్ట్ కబడ్డీ ఛాంపియన్ షిప్ పోటీలలో పాల్గొనే జిల్లా కబడ్డీ జట్టు సెలెక్షన్ ఈ నెల 17వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు ముప్కాల్ మండల కేంద్రంలోని 'భూదేవ్ ఇండోర్ స్టేడియం'లో చేపట్టనున్నట్టు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు అంద్యాల లింగయ్య, ప్రధాన కార్యదర్శి కె.గంగాధర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ నెల 16వ తేదీ సాయంత్రంలోపు రిపోర్ట్ చేయాలని సూచించారు. 2005 జనవరి 12కు ముందు జన్మించిన వారికి అర్హత లేదన్నారు. బరువు 70 కిలోల మించకూడదని అన్నారు. వయస్సు నిమిత్తం పదోతరగతి, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు 9618088086 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

19న బాలబాలికల అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ నిర్వహణ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్, పట్టణ ట్రస్మా ఆధ్వర్యంలో ఈనెల 19న నాగారంలోని రాజారామ్ స్టేడియంలో ఉదయం 10 గంటలకు, అండర్ 8, 10, 12, 14 సంవత్సరాల పట్టణ ప్రైవేట్ పాఠశాలల బాలబాలికల అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ నిర్వహిస్తారని ట్రస్మా జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాజాగౌడ్, పట్టణ అధ్యక్షులు ధర్మరాజు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి స్కూల్ నుంచి ప్రతి ఈవెంట్లో ఇద్దరు పార్టిసిపేషన్ చేయవచ్చునని, బాలుర విభాగంలో 19 ఈవెంట్స్, బాలికల విభాగంలో 19 ఈవెంట్స్‌లో పోటీలు నిర్వహిస్తారని, పట్టణంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలు తప్పక పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. ఈనెల 16న సోమవారం సాయంత్రం 5 గంటలలోపు పాఠశాలల ఎంట్రీస్ పంపాలని తెలిపారు. నాలుగు ఏజ్ గ్రూపులలో కలిసి 8 స్కూల్ ఛాంపియన్‌షిప్‌లు, అదేవిధంగా వ్యక్తిగత ఛాంపియన్‌షిప్స్ 8, 120 మెడల్స్ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఇతర వివరాలకు 9989040776 ఈ నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.


ఆర్మూర్: విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే


జక్రాన్‌పల్లి: మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాస్


మాక్లూర్‌లో...

ప్రభుత్వ పథకాల అమలుపై.. బాధ్యత వహించాలి

- పలు పాఠశాలల్లో డైట్‌మెనూ ప్రారంభం

నవతెలంగాణ-విలేకరుల బృందం

ఆర్మూర్ : ప్రభుత్వ పథకాల అమలుపై విద్యార్థుల తల్లిదండ్రులు బాధ్యత వహించాలని ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ రెసిడెన్షియల్ హాస్టల్స్‌ను సందర్శించి ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి హాస్టల్స్‌లో కాస్మెటిక్స్ చార్జీలు, డైట్ చార్జీలు పెంచిన సందర్భంగా ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి పట్టణంలోని బీసీ సంక్షేమ పాఠశాల ప్రాంగణంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు, తల్లిదండ్రులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో కంటే ప్రస్తుత ప్రభుత్వాలు పిల్లల బాగోగుల పట్ల శ్రద్ధ వహించడం అభినందనీయమని, ఈ అవకాశాన్ని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకుని వారి బంగారు భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని కోరారు. తల్లిదండ్రులు తరచూ పాఠశాలలను సందర్శిస్తూ తమ పిల్లల పట్ల శ్రద్ధ వహించాలని, ప్రభుత్వ పథకాలు సరిగ్గా అమలవుతున్నవి, లేనివి అడగాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనని ఈ సందర్భంగా సూచించారు. నియోజకవర్గానికి జవహర్ నవోదయ పాఠశాల, ఇంటర్నేషనల్ ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరయ్యాయని ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సృజన, పాఠశాల సిబ్బంది ప్రత్యేకాధికారిగా ఎంఈఓ రాజగంగారం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుపై శ్రద్ధ వహించాలి

జక్రాన్‌పల్లి : రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం 40 శాతం డైట్, కాస్మెటిక్ చార్జీలు 200 శాతం ఉపయోగించుకుని చదువుపై శ్రద్ధ కనబరచాలని ఎంఈఓ శ్రీనివాస్ అన్నారు. కలెక్టర్ ఆదేశానుసారం మండలంలోని బీసీ హాస్టల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన నూతన మెనూను ఆవిష్కరించి స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన రుచికరమైన భోజనం అందించడానికి వీలవుతుందని తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వం అందించే సౌకర్యాలను ఉపయోగించుకొని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్య పట్ల ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధను ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలలో నూతన మెనూ ప్రారంభం

రెంజల్ : మండల కేంద్రంలోని తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాలలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ శ్రావణ్ కుమార్ ఈ పాఠశాలను శనివారం సందర్శించి వంటగదిని పరిశీలించారు. తెలంగాణ ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలన్న తలంపుతో 40 శాతం మెస్ చార్జీలను పెంచిందని, తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల ఎలాంటి సందేహాలు పెట్టుకోవద్దని ఆయన సూచించారు. విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పోషకాహారాన్ని అందించాలని, ప్రిన్సిపాల్ హర్సియా నాజాంకు ఆదేశించారు. విద్యార్థులు ఇష్టంతో కష్టపడకుండా చదువుకొని ఉత్తమ ర్యాంకులను సాధించాలని ఆయన సూచించారు. ఆయన వెంట పాఠశాల ప్రిన్సిపాల్ హర్సియా నాజాం, గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో యూనిఫాం, డైట్‌మెనూ ప్రారంభం..

మాక్లూర్ : మండలంలోని దాస్‌నగర్ సమీపంలో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో "యూనిఫాం, డైట్ మెనూ ప్రోగ్రాం"ను డిప్యూటీ తహసీల్దార్ పద్మలత శనివారం ప్రారంభించారు. ముందుగా వంటశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం గురుకులాలలో విద్యార్థుల కాస్మెటిక్ చార్జీలు, డైట్ చార్జీలు పెంచిందని తెలిపారు. గురుకులాల్లో అన్ని రకాల వసతులతో పాటు నాణ్యమైన విద్యను అందజేస్తుందని, వాటన్నింటినీ వినియోగించుకొని విద్యార్థులు ఉన్నత స్థానానికి ఎదగాలని సభాముఖంగా విద్యార్థులకు తెలిపారు. ఈ సందర్భంగా "కామన్ డైట్ ప్లాన్" బ్యానర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ప్రిన్సిపాల్ ధాత్రిక వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ.. కళాశాలలో ప్రతీరోజు అందిస్తున్న (డైట్) పోషకాహారం వాటి విలువల గురించి తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. విద్యార్థుల మదర్స్‌తో రకరకాల ఆటలు ఆడించి 'సూపర్ మామ్'కు బహుమతులు ఇచ్చారు. తర్వాత విద్యార్థులు తల్లులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.ఎం.సరిత, సూపరింటెండెంట్ మహాలక్ష్మమ్మ, అధ్యాపకులు, విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి

- బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలి
- సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి
- బిసిటియు జిల్లా అధ్యక్షులు మాడవేడి వినోద్ కుమార్

నవతెలంగాణ-కంఠేశ్వర్

పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని బీసీటీయూ జిల్లా అధ్యక్షులు మాడవేడి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక కేర్ డిగ్రీ కళాశాలలో జరిగిన బిసిటియు సమావేశంలో వివిధ మండలాల బిసిటియు కార్యవర్గాలను ఏర్పాటు చేశారు. బిసి ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు మాడవేడి వినోద్ కుమార్ బిసిటియు సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఈ సందర్భంగా మాడవేడి వినోద్ కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం నూతన పిఆర్సీని వెంటనే అమలు చేయాలని, పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని, బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని, జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని అన్నారు. 4 పెండింగ్ డిఏలను కూడా అమలు చేయాలని, గురుకుల ఆదర్శ పాఠశాల, కెజిబివిల సమస్యలను పరిష్కరించాలని, బిసిలకు క్రిమిలేయర్ విధానాన్ని తొలగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిసి ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.గోపాలకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌లు కంచరి రవికుమార్, కొట్టాల రామకృష్ణ, గౌరవ అధ్యక్షులు కైరంకొండ బాబు, గౌరవ సలహాదారులు రమణ స్వామి, కొట్టూరు రమేష్, కార్యదర్శులు సతీష్ కుమార్, నామాల శంకర్, మోపాల్ మండల బిసిటియు అధ్యక్షులు గంగయ్య, మాక్లూర్ మండల బిసిటియు అధ్యక్షులు గంగోనె సంజీవ్, ఇందల్వాయి మండల బిసిటియు ప్రధాన కార్యదర్శి ఇంద్రకరణ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బిసిటియు జిల్లా అధ్యక్షులు మాడవేడి వినోద్ కుమార్

కళ్యాపూర్ గ్రామంలో ఘనంగా దత్త జయంతి

- గ్రామంలో అన్నదానం

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కళ్యాపూర్ గ్రామంలో శనివారం దత్త జయంతిని పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక హెూమం నిర్వహించి దత్త జయంతి ఉత్సవాలను నిర్వహించారు. వేద పండితులతో మహా యజ్ఞం చేపట్టారు. ఈ యజ్ఞంలో కరిపే రవి కిరణ్ దంపతులు కూర్చోగా, గ్రామంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని కలిసిన యువ నాయకులు


ఎమ్మెల్యేను సన్మానించిన నాయకులు

నవతెలంగాణ-నవీపేట్

మాజీమంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని యూత్ కాంగ్రెస్ మండల నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులుగా ఎన్నికైన మోహన్, బోధన అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులుగా ఎన్నికైన ఆవేజ్‌లు కలవగా పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయాలని అన్నారు. వారి వెంట మండల నాయకులున్నారు.

పిహెచ్‌సీని తనిఖీ చేసిన నేషనల్ టీమ్


సన్మానించిన పలువురు

నవతెలంగాణ-మెండోరా

మండల పరిధిలోని పోచంపాడ్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జాతీయ ఆరోగ్య వ్యవస్థల వనరుల కేంద్రం సభ్యులు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిహెచ్‌సి పరిధిలో సీజనల్ వ్యాధుల ప్రభావం, వాటి నివారణకు చర్యలను మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మద్దుల రాకేష్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలోని మందులు, ల్యాబ్, ఓపి రికార్డులను వారు పరిశీలించారు. రికార్డుల మెయింటెనెన్స్, విధుల పట్ల నేషనల్ టీం సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం బెస్ట్ మెడికల్ ఆఫీసర్‌గా బిరుదు ఇచ్చి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాకేష్‌ను నేషనల్ టీమ్ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్‌వో డాక్టర్ రాజశ్రీ, డిప్యూటీ డిఎంహెచ్‌ఓ డాక్టర్ రమేష్, నేషనల్ టీం సభ్యులు డాక్టర్ గోపాల్, డాక్టర్ శరానందన్, పిహెచ్‌సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


దీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే ధన్‌పాల్

సమగ్ర శిక్ష ఉద్యోగులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలి

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ డిమాండ్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

సమగ్ర శిక్ష ఉద్యోగులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చౌరస్తాలో ధర్నా చౌక్‌లో చేపట్టిన సమ్మె శనివారం 8వ రోజుకు చేరుకుంది. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే సూర్యనారాయణ గుప్తా హాజరై వారికి సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెట్టిచాకిరి చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులను సత్వరమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు హనుమకొండలో సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఇచ్చిన హామీని అమలు చేయడం లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు డాక్టర్ కొండ ఆశన్న, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్, ప్రధాన కార్యదర్శి భూపేందర్, మహిళా అధ్యక్షురాలు గంగామణి, నాయకులు ప్రకాష్, గంగాధర్, ప్రభు, రమేష్, రాణి, సుప్రజ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహలలో మౌలిక సౌకర్యాలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి..

వసతి గృహలలో మౌలిక సౌకర్యాలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. న్యాల్కల్ రోడ్‌లోని పీఎఫ్ ఆఫీస్ పక్కన ఉన్న ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని అడిషనల్ కలెక్టర్ అంకిత్‌తో కలిసి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వసతి గృహల డైట్ చార్జీలు 40 శాతం పెంచడం అభినందించదగ్గ విషయమన్నారు. ప్రస్తుతం ఉన్న నిత్యావసర ధరలకు అనుగుణంగా ఇంకో 20శాతం పెంచే పునరాలోచన రాష్ట్ర ప్రభుత్వం చేయాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం హయాంలో సంక్షేమ హాస్టళ్ల పరిస్థితి మురికి కుపాలుగా మారాయని, పురుగుల అన్నం తినాల్సిన పరిస్థితి ఉందని నేటికీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కూడా ఎటువంటి మార్పు లేదని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలో ఆహారకల్తీతో అనేక మంది విద్యార్థులు ఆస్పత్రుల పాలవుతున్నారన్నారు. అటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్, హాస్టల్ ఉపాధ్యాయులు, బీజేపీ కార్పొరేటర్‌లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ఈ నెల 15న నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నీలం రామచంద్రయ్య భవనంలో రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న రౌండ్ టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని రైతు సంఘం మండలాధ్యక్షులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు పూట్నూర్ బాలయ్య కోరారు. శనివారం మండల కేంద్రంలో అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం, ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు కూలీ సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాలు, రైతు సంఘాలు ఉదయం 11 గంటలకు నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నీలం రామచంద్రయ్య భవనానికి పెద్ద ఎత్తున తరలివచ్చి రౌండ్ టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు సారా సురేష్, బి.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మెన్‌కు ఘన సన్మానం



చైర్మెన్‌ను సన్మానిస్తున్న నాయకులు

నవతెలంగాణ-బోధన్

కోటగిరి మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా బాధ్యతలు చేపట్టిన గాయక్వాడ్ హనుమంతును శనివారం బోధన్ పట్టణంలోని రైస్‌మిల్ భవన్‌లో ఎమ్మార్పీఎస్ నాయకులు శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీనియర్ ఎమ్మార్పీఎస్ నాయకులు నాంపల్లి మాట్లాడుతూ.. దళిత నాయకులు హనుమంతు ఏఎంసీ చైర్మెన్‌గా ఎన్నికవడం అందరికీ సంతోషకరమని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని పదవులు చేపట్టి ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. అలాగే ఎస్సీ వర్గీకరణ సాధనలో మాదిగ మేధావులు కదిలి వచ్చి ఉద్యమించాలని కోరారు. భవిష్యత్తులో ఎస్సీ వర్గీకరణకు చేపట్టే కార్యాచరణపై ఆయన సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో నాయకులు డప్పుల చంద్రయ్య, గంధం చంద్రయ్య, గడ్డం రమేష్, లింబూరి లక్ష్మణ్, సాయిలు, విజయ్, అడ్లూరి శ్రీనివాస్, అబ్బయ్య, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

'మీరిచ్చిన మాట కదా'

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు సమ్మె నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అయితే సమ్మెలో భాగంగా మోర్తాడ్ జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఉపాధ్యాయుడు ఎం.రాము ముఖ్యమంత్రి చిత్రపటాన్ని (ఎస్‌-ఎస్‌ఏ) సర్వ శిక్ష అభియాన్ అబ్రివేషన్ ఆంగ్ల పదాలతో తెలంగాణ గీశారు. ఆ చిత్రపటాన్ని సమ్మెలో ప్రదర్శించారు. 'మీరిచ్చిన మాట కదా.. రెగ్యులర్ చేస్తామని సీఎం గారూ' అంటూ సీఎం చిత్రపటాన్ని ప్రదర్శించారు.



దేశ చరిత్రలోనే అతిపెద్ద రుణమాఫీ

- తమ ప్రభుత్వమే చేసింది
- ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

నవతెలంగాణ-ఏర్గట్ల

దేశ చరిత్రలోనే రైతులకు అతిపెద్ద రుణమాఫీ తమ కాంగ్రెస్ ప్రభుత్వమే చేసిందని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో రైతు, మహిళా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్‌రెడ్డి, రాష్ట్ర కార్పొరేషన్ సొసైటీ డెవలప్‌మెంట్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్, తాహెర్‌బిన్ హందాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. స్వతంత్ర భారతదేశ చరిత్రలోనే తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటి వరకు అతిపెద్ద రుణమాఫీ జరిగిందని, 25 లక్షల మంది రైతులకు 2లక్షల వరకు రుణమాఫీ అయ్యిందని, మిగిలిన వారికి కూడా విడతల వారీగా మాఫీ అవుతుందని తెలిపారు. రైతులకు రూ.500 బోనస్, 55 వేల ప్రభుత్వ ఉద్యోగాలు, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ అమలు చేశామని వివరించారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నామని, నియోజకవర్గానికి 3500 నుంచి 4500 చొప్పున రాష్ట్రంలో 4 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసినట్టు తెలిపారు. అనంతరం ముత్యాల సునీల్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల్లో తాను ఓడిపోయినప్పటికీ.. ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో నియోజకవర్గ ప్రజలకు సేవచేస్తున్నానని అన్నారు. రాష్ట్ర కార్పొరేషన్ సొసైటీ డెవలప్‌మెంట్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి మాట్లాడుతూ..

ప్రతి ఒక్క కాంగ్రెస్ పార్టీ కార్యకర్త వల్లనే పార్టీ అధికారంలోకి వచ్చిందని, కష్టపడ్డ ప్రతి ఒక్క కార్యకర్తకు న్యాయం చేస్తామని అన్నారు. తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ మాట్లాడుతూ.. మహిళా సంఘాలకు అత్యధికంగా పావలా వడ్డీ రుణాలు ఇచ్చి వారిని ఆర్థికంగా నిలబెట్టామని, కాంగ్రెస్ పార్టీ మహిళలకు అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు శివన్నోళ్ళ శివకుమార్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు దేవరెడ్డి, నాయకులు ఆడేం గంగాప్రసాద్, ముస్కు మోహన్ రెడ్డి, గడ్డం జీవన్, రవిరెడ్డి, మునీరొద్దీన్, కొరిపెల్లి లింగారెడ్డి, రేండ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

చార్జీల పెంపుతో విద్యార్థులకు లబ్ది

- జయశంకర్ భూపాలపల్లి ఐఎఫ్ఎస్ నవీన్‌రెడ్డి



మాట్లాడుతున్న నవీన్‌రెడ్డి

నవతెలంగాణ-మోపాల్

ప్రభుత్వం విద్యార్థులకు పెంచిన చార్జీలతో చాలామంది పేద విద్యార్థులకు లబ్ది చేకూరుతుందని జయశంకర్ భూపాలపల్లి ఐఎఫ్ఎస్ నవీన్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని కంజర గ్రామంలో గల మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల సంక్షేమ వసతి గృహాల్లో డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపు ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ.. ఈ అవకాశాన్ని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తు కోసం చాలా ఖర్చు పెడుతుందని తప్పకుండా మీరు వీటిని వినియోగించుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మోపాల్ మండల ఎంపీడీవో రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

1వ తేదీనే వేతనాలివ్వాలి : ఐఎఫ్‌టీయూ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

మున్సిపల్ కార్మికులకు 1వ తేదీన వేతనాలు ఇవ్వాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షులు శివరాజ్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. చాలీచాలని వేతనాలతో సతమవుతున్న మున్సిపల్ కార్మికులకు 14 రోజులుగా వస్తున్న వేతనాలు ఇవ్వకపోవడం సిగ్గుచేటని ఆయన పేర్కొన్నారు. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు ఎంతమంది కమిషనర్లు వచ్చినా.. కార్మికుల బతుకులు మాత్రం మారడం లేదని ఆయన తెలిపారు. కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలన్న సుప్రీంకోర్టు తీర్పును ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటని, ప్రతి కార్మికుడికి నెలకు రూ.14,500 మాత్రమే వస్తున్నాయని పేర్కొన్నారు.

బాపూజీ వచనాలయాభివృద్ధికి సహకరిస్తాం : ఎమ్మెల్యేల హామీ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

బాపూజీ వచనలయానికి సహకరిస్తామని బోధన్ శాసనసభ్యులు పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. నిజామాబాద్ నగరంలో నూతనంగా ఎన్నికైన బాపూజీ వచనాలయ ఎన్నికలలో గెలుపొందిన నూతన కమిటీ సభ్యులు బోధన్, అర్బన్ ఎమ్మెల్యేలను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. బాపూజీ వచనాలయానికి ఏ అవసరమున్నా సంప్రదించాలని, అండగా ఉంటామని అన్నారు. విద్యార్థులకు అండగా నిలబడి వారికి కనీస వసతులు కల్పించాలని కోరారు. అవసరమైన ప్రభుత్వ నిధులు కూడా మంజూరు చేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో కార్యదర్శి మీసాల సుధాకర్‌రావు, కోశాధికారి బి.గంగాధర్‌రావు, ఉపాధ్యక్షులు భవంతి దేవిదాస్, సంయుక్త కార్యదర్శి సాంబయ్య, సభ్యులు లక్కంరెడ్డి, కోమూరు జగన్, ప్రతాప్ రుద్ర, మహిపాల్‌రెడ్డి, పుల్లం హనుమండ్లు, ఆరెట్టి లక్ష్మి నారాయణ, ఆమందు విజయ్, పాటి అనిల్ రెడ్డి, గోవింద్ ప్రసాద్ జవర్ తదితరులు పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-బోధన్

సాలూర మండల కేంద్రంలో శనివారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి బీఆర్ఎస్ నాయకులు వెంకటి పటేల్ కుమారుని వివాహంలో పాల్గొని నూతన వధూవరులు డా.రాహుల్, డా.సీమను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగ వెంకట్ పటేల్, శారద దంపతులు ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మెన్, బీఆర్ఎస్ నాయకులు సాలూర షకీల్, కాంగ్రెస్ నాయకులు గంగాశంకర్, బిల్ల రామ్మోహన్, అల్లె రమేష్, కేజీ గంగారాం, మాజీ ఎంపీపీ గోవిందగౌడ్ తదితరులున్నారు.

బాధితులకు ఎమ్మెల్యే ఆర్థిక సహాయం



ఆర్థికసాయాన్ని అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-మెండోర

మండల కేంద్రంలో గత పది రోజుల క్రితం షాక్ సర్క్యూట్‌తో ఇండ్లు దగ్ధమైన బాధితులు గొల్ల దేవమల్లు, తక్కల సాయన్నకు చెందిన ఇండ్లు పూర్తిగా కాలిపోవడంతో మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి వారి కుటుంబాలకు ఆర్థిక సహాయం పంపించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు, డిసిసిబి డైరెక్టర్ నాగంపేట్ శేఖర్‌రెడ్డి బీఆర్ఎస్ నాయకులతో కలిసి బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించారు. బాధిత కుటుంబీకులకు ధైర్యాన్ని ఇచ్చారు. బాధిత కుటుంబీకులు, బిఆర్ఎస్ నాయకులు ఆర్థిక సహాయం అందించిన ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సొసైటీ చైర్మెన్ మచ్చర్ల రాజరెడ్డి, మాజీ జడ్పీటిసి తలారి గంగాధర్, మాజీ సర్పంచ్‌లు మచ్చర్ల రాజరెడ్డి, గోపిడి గంగారెడ్డి, బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బొల్లపల్లి నవీన్‌గౌడ్, గ్రామ అధ్యక్షుడు మిట్టపల్లి మోహన్‌రెడ్డి, నాయకులు అలుగుల శ్రీనివాస్‌రెడ్డి, కొప్పుల సాయన్న, ముస్కు రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

శబరిమత ఆశ్రమానికి 3 కిలోల వెండి బహుకరణ

నవతెలంగాణ-తాడ్వాయి

మండల కేంద్రంలోని శబరిమత ఆశ్రమానికి మూడు కిలోల వెండి బహుకరణ వచ్చినట్టు ఆలయ ట్రస్ట్ సభ్యులు శనివారం తెలిపారు. నల్గొండ జిల్లాకు చెందిన ఎరుక దిండ్ల సతీష్ సంతోషి దంపతులు 3కిలోల వెండి అమ్మవారి సన్నిధికి బహుకరించినట్టు తెలిపారు. తాముగత కొంతకాలం నుంచి ఆశ్రమానికి వస్తున్నామని తమ వంతు కృషి చేసినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మేకల రాజు, మాజీ వైస్ ఎంపీపీ నర్సింలు, రాజాగౌడ్, సంగారెడ్డి, బాల కిషన్‌రావు, ఆలయ ట్రస్ట్ సభ్యులు, తదితరులున్నారు.

రుచికరమైన భోజనం అందించాలి

నవతెలంగాణ-తాడ్వాయి

విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని ప్రత్యేక అధికారి రాజారాం అన్నారు. శనివారం బాలికల గురుకుల పాఠశాల భోజనాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వంట చేసే సమయంలో పాత్రలు ఎప్పటికప్పుడు శుభ్రంగా కడిగి వంటలు చేయాలని తెలిపారు. తాజా కూరగాయలతో రుచికరమైన వంటలు చేయాలని వంట గదిలో చిన్నపాటి మురికి లేకుండా పరిశుభ్రత పాటించాలని సూచించారు. మెను ప్రకారం భోజనం అందించాలన్నారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో రహీముద్దీన్, ఎంపీఓ సవిత రెడ్డి, హను మండ్లు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

17న చలో హైదరాబాద్

- కార్యక్రమాన్ని విజయవంతం చేయండి
- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జంగం గంగాధర్

నవతెలంగాణ-నవీపేట్/డిచ్‌పల్లి

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం 17వ తేదీన చలో హైదరాబాద్ కార్యక్రమానికి గ్రామపంచాయతీ సిబ్బంది అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జంగం గంగాధర్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో గ్రామపంచాయతీ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆంజనేయులు అధ్యక్షతన మండల కమిటీ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జంగం గంగాధర్, జిల్లా ఉపాధ్యక్షులు నాగన్న మాట్లాడుతూ గత ఐదు ఆరు నెలలుగా వేతనాలు రాక కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే వేతనాలను విడుదల చేయాలని అన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.21000 అమలు చేయాలని అన్నారు. ఈ నెల 17వ తేదీన ఇందిరాపార్క్ వద్ద ధర్నా కార్యక్రమానికి అధిక సంఖ్యలో పంచాయతీ సిబ్బంది హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు నాయక్‌వాడి శ్రీనివాస్, దేవకి, కారోబార్ యూనియన్ అధ్యక్షులు మీస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నవీపేట్ : సమావేశంలో మాట్లాడుతున్న జంగం గంగాధర్

17న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి..

డిచ్‌పల్లి : ఈనెల 17న చలో హైదరాబాద్ జెఎసి ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గ్రామపంచాయతీ కార్మికులకు పిలుపు ఇచ్చారు. శనివారం డిచ్‌పల్లి మండలంలోని మెంట్రాజ్‌పల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టియు జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్ పాల్గొని మాట్లాడుతూ కార్మికుల జీతాలకై, పంచాయతీ కార్మికులకు పర్మినెంట్, ఈఎస్ఐ సమస్యలు, కారోబార్, బిల్ కలెక్టర్‌లకు పర్మినెంట్, వారికి పదోన్నతులు కల్పించాలని గ్రామపంచాయతీ సిబ్బందికి ప్రతినెల రూ.26 వేల వేతనం ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బిల్ కలెక్టర్ షేక్ ఆసిఫొద్దిన్, కార్మికులు సాయిలు, శేఖర్, కిరణ్, పాండు, దావీద్ తదితరులు పాల్గొన్నారు.



డిచ్‌పల్లి: సమావేశంలో పాల్గొన్న నాయకులు

విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

నవతెలంగాణ-ఆర్మూర్



కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి నిర్విరామ కృషి చేస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్ దేవి లావణ్య అయ్యప్ప శ్రీనివాస్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ ప్రభుత్వ సమీకృత సంక్షేమ బాలుర వసతి గృహంలో ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన కామన్ డైట్ మెనూ ను శనివారం ఆర్డీవో రాజాగౌడ్, ఏసిపి వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. వంటగదిని, వంట సామగ్రిని, వంట వండుతున్న విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు డైట్ చార్జీలను పెంచడం గొప్ప విషయమని అన్నారు. ముఖ్యంగా విద్యార్థులు మొబైల్ ఫోన్లకు బానిసకావద్దని సూచించారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. వారు విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కౌన్సిలర్ లిక్కి శంకర్, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పిడిఎస్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-ఆర్మూర్

విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిఎస్పి సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద డీసీఎం వాహనంలో 21 టన్నుల పిడిఎస్ బియ్యాన్ని శుక్రవారం రాత్రి పట్టుకున్నారు. విజిలెన్స్ డిప్యూటీ తహసీల్దార్ వినోద్ పంచనామా నిర్వహించి డీసీఎం నడుపుతున్న జాకీర్, డీసీఎం ఓనర్ రాహుప్, పట్టణానికి చెందిన నజ్జ, మధనం ఎల్లయ్యపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పిఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు స్టేషన్ హౌస్ ఆఫీసర్ సత్యనారాయణ గౌడ్ తెలిపారు.

ఎస్టి హాస్టల్ తనిఖీ

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండల కేంద్రంలో గల బాలుర ఏసి హాస్టల్‌ను మండల ప్రత్యేక అధికారి ఏడీఏ రత్నం ఎంపీడీవో ప్రభాకర్ చారి శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని వార్డెన్ రాములుకు ఆదేశించారు. పదవ తరగతి విద్యార్థుల కొరకు ప్రత్యేక క్లాసులు ఏర్పాటుచేసి బోధన చేయాలని ఆదేశించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నాం

- ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి
- కామన్ డైట్ మెనూ ప్రారంభం
- విద్యార్థినులతో కలిసి భోజనం చేసిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-డిచ్‌పల్లి



భోజన నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ప్రభుత్వ గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలల్లో చదువుకుంటున్న గ్రామీణ పేద విద్యార్థులకు కాంగ్రెస్ ప్రభుత్వం నాణ్యమైన భోజనం అందజేస్తుందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి పేర్కొన్నారు. శనివారం డిచ్‌పల్లి మండలంలోని సుద్దపల్లి గ్రామ శివారులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల/ కళాశాలలో ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన కామన్ డైట్ మెనూను ఎమ్మెల్యే భూపతిరెడ్డి ప్రారంభించారు. అనంతరం విద్యార్థినులు, వారి తల్లిదండ్రులతో కలిసి ఎమ్మెల్యే మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యాసంస్థలు, గురుకుల పాఠశాలలను పట్టించుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 45 శాతం మెస్ ఛార్జీలను పెంచి విద్యార్థులకు నాణ్యమైన భోజనం, బ్యాలెన్స్‌డ్ డైట్‌ను అందిస్తుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు అన్ని వర్గాల ప్రజలకు అందేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక ఆదేశాలతో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ, బీసీ, మైనార్టీ వసతిగృహాలలో విద్యార్థులకు ఐదో తరగతి నుంచి 12వ తరగతి వరకు నాణ్యమైన భోజనం అందించడమే లక్ష్యంగా మెస్ ఛార్జీలు పెంచినట్టు తెలిపారు. గత ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమాన్ని ఏమాత్రం పట్టించుకోకుండా తీవ్ర నిర్లక్ష్యం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు పౌష్టికాహారం అందించేలా న్యూట్రిషన్, మిల్లెట్లు, పాలు ఇతర బలవర్ధక పోషకాలు కలిగిన డైట్ మెనూ అందిస్తున్నట్లు తెలిపారు.

మంచి ఆహారాన్ని తీసుకుని మంచి విద్య అభ్యసిస్తే మీరే రేపటి డాక్టర్లు, ఇంజనీర్లు, సైంటిస్టులుగా ఇలా వివిధ రంగాలలో రాణిస్తారని పేర్కొన్నారు. పాఠశాలలోని విద్యార్థినులు జాతీయస్థాయికి వెళ్ళటం గొప్ప విషయమని వారిని ప్రశంసించారు. త్వరలోనే రూరల్ నియోజకవర్గం పరిధిలోని డిచ్‌పల్లి మండలం సుద్దులం గ్రామంలో 25 ఎకరాలలో ఆధునాతన ఇంటిగ్రేటెడ్ టెక్నికల్ రెసిడెన్సియల్ ఇన్సిస్టిట్యూషన్ నిర్మాణ పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఇందులో అన్ని వర్గాలకు చెందిన సుమారు 3 వేల మంది విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ నళిని, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు అమృతాపూర్ గంగాధర్, మోత్కురి నవీన్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బాడ్సి శేఖర్‌గౌడ్, మునిపల్లి సాయరెడ్డి, రూరల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పొలసాని శ్రీనివాస్, నవీన్‌గౌడ్, విండో చైర్మన్లు రామకృష్ణ, చింత శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ న్యాస రాజేశ్వర్, శాంసన్, డాక్టర్ శాదుల్లా, డాక్టర్ జాహుర్, వాసుబాబు, వినోద్, నరేష్, స్వప్న, ఎస్‌హెచ్‌ఓ మోహమ్మద్ హమ్మద్ షరీఫ్, ఎండి ఇబ్రహం, కార్యకర్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అత్యవసర సేవలను సద్వినియోగం చేసుకోవాలి

అత్యవసర సేవలను సద్వినియోగం చేసుకోవాలని, నియోజకవర్గంలోని ప్రస్తుతం మూడు మండలాలకు అంబులెన్స్‌ను కేటాయించిందని, ఆపదలో ఉన్నప్పుడు ఈ అంబులెన్స్ ప్రాణదాతగా నిలుస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. శనివారం డిచ్‌పల్లి మండలంలోని సుద్దపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల కళాశాల వద్ద 108 అంబులెన్స్ సేవలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలనలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు నూతనంగా 108 అంబులెన్స్‌లను రాష్ట్రంలో అన్ని జిల్లాలకు కేటాయించిందని తెలిపారు. అందులో భాగంగా నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ పరిధిలోని ఇందల్‌వాయి, జక్రాన్‌పల్లి, ధర్పల్లి మండలాలకు 108 అంబులెన్స్ కేటాయించినట్లు తెలిపారు. అంతకు ముందు 108 అంబులెన్స్ సేవలను ఎమ్మెల్యే భూపతిరెడ్డి పూజలు నిర్వహించి జెండా ఊపి ప్రారంభించారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో అత్యవసర సేవల నిమిత్తం 3 మండలాలకు అంబులెన్స్‌లు కేటాయించినట్లు తెలిపారు. ప్రజలు ఈ సేవలను ఉపయోగించుకోవాలని నియోజకవర్గ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, డిచ్‌పల్లి కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అమృతపూర్ గంగాధర్, మోత్కురి నవీన్‌గౌడ్, సీనియర్ నాయకులు మునిపల్లి సాయిరెడ్డి, పోసాని శ్రీనివాస్, శాంసన్, 108 సిబ్బంది సంతోష్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, విజయ్ కుమార్, మేకల శ్రీనివాస్, మహేష్, సంతోష్ రాథోడ్, సుందర్ అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే